కథా నిలయం
శ్రీకాకుళం

# వరమివ్వని వేలుపు

లెక్చర్లివ్వడం చాలా తేలిక. నేను నా జీవితంలో వెయ్యి లెక్చర్లిచ్చాను. మైకు ఎదుట నిలబడి, వేలకొలది శ్రోతల్ని ఉద్దేశించి మాట్లాడితేనే లెక్చరనిగాదు. మరికొంత విశాలార్థంతో చెబుతున్నాను.

వినడానికి లోకువగా ఒక నరమానవుడు దొరకడమే తరువాయి. చిన్నదో, పెద్దదో ఒక లెక్చర్ని వాడి తలపైనవేసి పులమడానికి నేను వెనుకాడిందిలేదు. ఆపరేషన్ దగ్గరినుంచీ కో ఆపరేషన్ దాకా, అణువునుంచీ ఆవకాయదాకా విస్తరించివున్న అసంఖ్యాకమైన ఉపన్యాసాలలో నాకు అత్యంత ప్రియమైన నా పేటంటు లెక్చరు "చదువు".

ఎవడి బంగారాన్ని గురించి కనీసం వాడైనా మాట్లాడకపోవడం అన్యాయమని మీరైనా ఒప్పుకోకుండా వుండలేరు. ఈ న్యాయాన్ని పురస్కరించుకుని "చదువు"ని గురించి నేను కాస్త బరితెగించి మాట్లాడి వుంటానని కూడా ఇప్పుడు నాకనిపిస్తూంది. నేను విద్య నిగూఢ గుప్తమగు విత్తము అన్నాను. పురుషాళికదే రూపమన్నాను. అదే యశస్సు అన్నాను. భోగకరి గూడా అదేనన్నాను. చదువు నేర్వనివాడు మనిషిగా పేర్కొన బడడానికే అర్హుడుకాడు పొమ్మన్నాను. అయితే అరిగిపోయిన పాత గ్రామఫోను రికార్డును విన్నట్టుగా ముఖం చిట్లించి, ఈ మాటల్ని యింతకు పూర్వం ఎక్కడో విన్నట్టే వుందంటూ అతితెలివిని వెళ్ళబోసిన వాళ్లు సైతం లేకపోలేదు. ఎటొచ్చీ ఆ మాట నిజమే! భర్తృహరి అనే మహానుభావుడు సంస్కృతంలో చెప్పిన నీతి శ్లోకాలను తెలుగు కవి ఒకాయన పద్యాల్లో వ్రాసి పెట్టి పోయాడులెండి! అందులోని ఒక పద్యంలోనివే నా మాటలన్నీనూ! చింతకాయ పచ్చడి ఎంతగా పాతబడితే అంత శ్రేష్ఠమని అందరికీ తెలుసు! ఇతరుల మాటల్ని వాడుకోడంలో నాకేమీ నామోషీతనం కనిపించలేదు!

నేను వేసుకున్న బాటపైన నేనిలా నిరాఘాటంగా సాగిపోతుండగా, మార్గమధ్యంలో నన్ను నిలబెట్టి, నాది అగమ్య గమ్యస్థానమని నిరూపించి, ఇంత దూరం దారితప్పి

వచ్చినందుకు నన్ను వెక్కిరిస్తూ ఫక్కున నవ్విన సంఘటనల్ని గురించి చెప్పుకోడమంటే నాకెంత బాధగా వుంటుందో మీరు గ్రహించగలరు!

నాకు జ్ఞానోదయం కలగడానికి కారకులైన వ్యక్తు లిద్దరు. ఆ ఇద్దరూ గర్వకారణమా? దుఃఖకారణమా? ఏమో నేను చెప్పలేను!

ఒకడేమో నా ప్రియశిష్యుడు చింతామణి. చదువులనేవి అందరికీ కొరుకుడు పడని యినప గుగ్గిళ్ళలాంటివైతే, వాటి పాలిటికి అయస్కాంతంలాంటివాడు చింతామణి. వీడెందుకోసం పుట్టివుంటాడన్న విషయంపైన పెద్దగా వితర్కాలు పెట్టుకో నవసరం లేకుండా ఏడెనిమిదేళ్ళ వయసులోనే ఆ ప్రశ్నకొక సమాధానం సరఫరా చేశాడు చింతామణి. తాను చదువుకోడం కోసమే పుట్టాడు. అందుకోసమని విధిగా ఒక పుస్తకం కావాలన్న పట్టింపు కూడా లేదు. పాత పెండ్లి పత్రిక దొరికినా చాలు. ఏదో వస్తువు పొట్లం కట్టించుకొచ్చిన కాగితమైనా చాలు. సినిమా కరపత్రాన్ని సైతం రాజుగారి ఫర్మానాకుమల్లే శ్రద్ధగా చదువుకునే చింతామణిని చూస్తుంటే ఎంతో ముచ్చటగా వుండేది. తిండీ, నీళ్ళూ లేకపోయినా మనిషి బ్రతకడం సాధ్యమేనని నిరూపించడం చాలా సులభం. మరేంలేదు. చింతామణిని పెద్ద గ్రంథాలయంలో ప్రవేశపెట్టి వాడలా వెళ్ళగానే తలుపులు మూసి తాళం బిగించెయ్యాలి. ఆరునెలల తరువాత తెరిచి చూచినాసరే, వాడు చెక్కుచెదరకుండా శ్రద్ధగా పుస్తక పఠనంలో నిమగ్నుడయి ఉంటాడని నావూహ. ఇలాంటి చింతామణిని చదువులపైకి వదిలిపెట్టి వాటి అంతేమిటో కనుక్కోవాలన్న పట్టుదల నాకుండేది. కానీ ఆ మాత్రం స్తోమతవాడి తండ్రికి లేకపోవడముండే, అదే విధి విధానంలోని విపర్యయం. అందువల్ల వాడి చదువుల పూచీ యించుమించుగా నేనే స్వీకరించాను. "అయ్యా! ధర్మయ్యా! వీడెవరో నీ యింట్లో పుట్టవలసిన వాడు కాదు. పూర్వజన్మలో ఒక యోగ భ్రష్టుడై వుంటాడు. నువ్వేం బెంగపడొద్దు. ఇంత బాగా చదువుకునేవాడికి స్కాలర్‌షిప్పులు దొరక్కపోతాయా? తప్పకుండా వస్తాయి. చాలనిదానికి నువ్వు నెల నెలా పాతికో, పరకో పంపుకోవలసి వస్తుంది. పరవాలేదు. అప్పు చెయ్యి. వాడే తీర్చుకుంటాడు." అంటూ ఆ తండ్రిని పురికొల్పుతూ వచ్చాను.

రెండోవాడి పేరు ఖాదర్బాషా, క్లాసులో అందరికంటే వెనుక వైపున వాడి స్థానం. అందుకు కారణం వాడెప్పుడూ బడికి లేటుగా రావడమే! వాళ్ళ నాన్న ఫకరుద్దీన్‌కు కొడుకంటే ఎక్కడలేని ఆపేక్ష. వీధుల్లో ఎక్కడైనా తారసపడితే "అయ్యు గారూ! లమ్డీ కొడుకు, చెప్పిన మాట బొత్తిగా యినడం లేదండీ! చమ్డాతోలు ఒలిచి పారెయ్యండి!" అంటుండే వాడు. వాళ్ళమ్మ ఫాతిమాబీ మాత్రం నెల తక్కువగా పుట్టిందా? ఆమె మా

ఆవిడ ద్వారా కొడుకుని గురించిన వర్తమానాలను నా చెవికి చేరవేస్తుండేది. "కుఱ్ఱకుంక వట్టి పుండాకోర్లై పోయాడటండీ! సున్నంలోకి ఎముక లేకుండా విరగ్గొట్టమంది ఫాతిమా" అంటుండేది మా ఆవిడ.

ఫక్రుద్దీన్ మాట ప్రకారం మొదట ఖాదర్బాషా తోలు ఒలిచెయ్యాలి. ఆపైన తల్లి కోరిక మేరకు ఎముకలు నుగ్గునూచం చెయ్యాలి. ఇక చూచుకోవలసింది ఖాదర్బాషా స్వరూపం!

వీడెందుకు పనికొస్తాడా అనుకునేవాణ్ణి నేను ఖాదర్బాషాను చూచినప్పుడల్లా! తన రెండో తమ్ముడికైతే బాగా సరిపోయే చిన్న షరాయి ఒకటి వేసుకుని, దానిపైన గోనెపట్టలాంటి తన ఏకైక పాతచొక్కా ఒకటి తగిలించుకుని వాడు బిక్కు బిక్కు మంటూ గుమ్మంలోనుంచే తొంగిచూసేవాడు. "వచ్చాడురా ఖాదర్బాషా" అని నేననడమే ఆలస్యం, కుఱ్ఱవాళ్ళందరూ ఒక పెట్టున "అబ్స్సలామలేకుం ఖాదర్పాదుషా సాహెబ్" అంటూ అందుకునే వాళ్లు. అప్పటికదేదో ఒక పెద్ద సన్మానమైనట్టుగా ముసి ముసి నవ్వులు వెదజల్లేవాడు ఖాదర్బాషా. యింతసేపూ యేం చేస్తున్నావురా? చెప్పవేంరా? చెబుతావా, చావగొట్టమన్నావా? ఊఁహూ, లాభం లేదు. యిలాంటి తాటాకుల చప్పుళ్లు వాడి పైన పని చెయ్యవు. వానాకాలంలో మబ్బులు, మెరుపులు, ఉరుములు, ఎంత సహజమో! తనిలా బడికి ఆలస్యంగా రావడమూ, అందుకు అయ్యవార్లు గొంతు చించుకోడమూ కూడా అంతే సహజమైనట్టు వాడు చాలా ముభావంగా వుండిపోయేవాడు.

కొట్టొచ్చు, కొట్టాను కూడా! కానీ ఆ యింట్లో రాత్రిపూట వండిన అన్నం రాత్రికే సరిపోతుందనీ, ఉదయం ఎవరికీ చద్దన్నాలు వుండవనీ, తల్లి తినడానికి తనకేమైనా పెట్టి ఆ తరువాత బడికి పంపుతుందేమో నన్న ఆశతో ఈ పసివాడు కాలహరణం చేస్తూ వుంటాడనీ నేను గ్రహించలేదు. మనుషులదంతా ఉష్ణపక్షివాటం! సుష్టుగా తిన్నామనుకోండి! ఇక లోకమంతా భుక్తాయాసం తీర్చుకుంటున్నట్టే వుంటుంది మనసు!

ఒక్కొక్కప్పుడు పది పదిహేను రోజుల దాకా అయిపులేకుండా పోయేవాడు ఖాదర్బాషా. అప్పుడిక పునరాగమనం జరిగిన రోజున కాస్త తీవ్రమైన చర్య తీసుకోవలసి వచ్చేది. రెండు పూటలా ఎండలో నిల్చోబెట్టడం, గోడ కుర్చీ వెయ్యడం, కాలికి తుండు తగిలించడం యిలాంటి శిక్షలను బాషా కిమ్మనకుండా భరించేవాడు. ఈ మాత్రం బాధలనైనా భరించలేకపోతే, ఈ ప్రపంచంలో తనలాంటి వాళ్లు బ్రతకడమెలా సాధ్యమని

ప్రశ్నిస్తున్నట్టుగా వుండేవి వాడి చూపులు!

ఒక రోజు గాలిదెయ్యాన్ని అదిలిస్తున్న మంత్రగాడిలా చింతబరికె ఒకటి ఝుళిపించుకుంటూ కొడుకు వెంట బడిలోకొచ్చి పడ్డాడు ఫక్రుద్దీను. "అయ్యగారూ! ఈ రోజు అయిసాపైసా తేలిపోవలసిందేనండీ" అన్నాడు. మామూలు కథే! అప్పటికి బాషా బడికివచ్చి మూడు వారాలు దాటింది.

ఆ పని నాచేతగాదని తేలిపోయింది గనుక నాకిప్పుడు రోగానికి మందివ్వాలన్న ధ్యాసలేదు. వీలైతే రోగకారణం మాత్రం తెలుసుకోవాలనివుంది. ఫక్రుద్దీను వెళ్ళిపోయాక రకరకాలుగా బుజ్జగించిన మీదట ఆ కారణమేమిటో తెలుసుకోడానికి వీలయింది.

వేరుశనగ తీగలు - లాగేస్తుండగా కాయలుకొన్ని తునిగిపోయి అలాగే నేలలో వుండిపోతాయి. పొలం పరిగిల పోయిన తర్వాత బీదా బిక్కీ భూమిని త్రవ్వి ఆ కాయలేరి తెచ్చుకుంటారు. బాషా గడచిన పది పదిహేను రోజులుగా చేస్తున్న పని అదే!

"ఎన్ని కాయలు కూడేశావురా బాషా?" అన్నాను.

"ఏ రోజు కాయలు ఆరోజే మా అమ్మ అమ్మేసుకుందండీ" అన్నాడు బాషా.

"మీ అయ్యతో చెప్పలేకపోయావా?"

"చెబితే మా అమ్మ ఒళ్ళు చీరేస్తుందండీ!"

నా కప్పటికి తెలిసింది బొమ్మలో ఒకవైపు మాత్రమే పూర్తి నిజం! మరికొంచెం వాకబుచేసిన తరువాత తెలిసింది. కొడుకు చదువుకున్నా నాలుగు రూకలు చేతిలో పడడమే ముఖ్యమనుకోవడంలో ఈ తండ్రి తల్లికేమీ తీసిపోలేదు. చింతపండు కాలంలో ఫక్రుద్దీను చెట్టెక్కి కాయలు కోస్తే, బాషా కాయలేరి ప్రోగుచేస్తాడు. మామిడి పండ్ల సీజనులో తండ్రి బుట్టలు కుడితే, కొడుకు బుట్టలపైన అక్షరాలు దిద్దుతాడు. ఇంకా యిలాంటి చిల్లర పనులెన్నింటికో వినియోగించుకుంటూ ఫక్రుద్దీను కుర్రాడి శ్రమను డబ్బుగా మార్చుకుంటున్నాడు.

నిజం చెప్పాలిగదా! కోపంతో నా ఒళ్ళు మండుకపోయింది, ఏ కూర కోసమో, చారుకోసమో వచ్చి పెరట్లో మా ఆవిడతో మాటాడుతున్న ఫాతిమాను పిలిపించి ఘాటుగా నాలుగు చీవాట్లు పెట్టాను. అంతలో తనయుడు చెడుగైన తప్పు తండ్రిదని స్ఫురించి "ఒకసారి మీ సాయిబును వచ్చి నాతో మాట్లాడి వెళ్ళమని చెప్పు" అన్నాను. ఆ హెచ్చరికతో నా పాలిటకొక అత్తి పువ్వయి పోయాడు ఫక్రుద్దీను. తప్పించుకుని తిరగడం మొదలెట్టాడు. కానీ ఒకే వూళ్ళో వున్న వ్యక్తి ఎంతకాలమని అలా ముఖం చాటు చేసుకుని తలాయించుకుని తిరగ్గలడు? ఓ రోజు హఠాత్తుగా ఎదురయ్యాడు. నడి వీధిలో, నిలబెట్టేశాను. "ఏంటోయ్

ఫక్రుద్దీన్? అప్పటికి కపట నాటకమంతా నీ ఒక్కడికే చేతనౌతుందనా నీ ఉద్దేశం? నిజంగా నీకు చదవాలని వుంటే కుర్రాణ్ని క్రమంగా స్కూలుకు పంపించాలి. లేదంటే శుభ్రంగా బడి మాన్పించేసి నీకు తోచిన పనిలో పెట్టుకోవాలి. అవ్వా బువ్వా రెండూ కావాలనుకుంటే ఎలా దొరుకుతాయయ్యా నీకు? బిడ్డల్ని కనగానే సరిపోయిందా? బాధ్యతలు తెలుసుకోవద్దూ? ఆ ధర్మయ్యగారబ్బాయి చింతామణి ఉన్నాడు చూడు! బిడ్డంటే వాడయ్యా బిడ్డ? తుమ్మ జిగురులా చదువులకంటుక పోయాడు. పట్టి లాగినా యివతలకు ఊడిరాడు. ఏనాడు బడిలో వేశారో, ఆనాడిక వీడు నా బిడ్డగాదు, మీ బిడ్డే నన్నాడు ధర్మయ్య! చదువుల తల్లి ఒడిలో అలా నిశ్చింతగా పెరగనివ్వాలయ్యా బిడ్డను! నువ్వూవున్నా వెందుకూ?"

ఫక్రుద్దీను గింజు కున్నాడు. "ఏ. వో జరగని బండాటలండీ బాబుగారూ. తమరు పెద్ద మనసు పెట్టాల! కుర్ర ఎదవకు నాలుగచ్చరం ముక్కలొస్తే ఒకరి దగ్గరి కెళ్ళేపని లేకుండా వాడి జాబూ, జవాబూ వాడే చూచుకుంటాడు."

ఐతే తీరా మారా నాలుగో తరగతి పూర్తయ్యేవరకైనా బాషా చదువుకొనసాగ లేదు. ఓ రోజు తెల్లవారేసరికి మాయింటికి పెరటివైపున వున్న గుడిసెల్లో నుంచీ సన్న సన్నగా శోకాలాపన వినిపించింది. బాషా కంటికి కనిపించకుండాపోయి నాలుగు రోజులైందట. తిరగవలసిన చోట్లన్నీ తిరిగివచ్చి ఫక్రుద్దీను నేలపైన నూకలు బాకీవుంటే వాడెక్కడో ఒకచోట పదిలంగానే వుంటాడు లెమ్మంటున్నాడట! కన్నతల్లి కామాత్రం నిబ్బర ముండొద్దూ? కడుపు చెరువయ్యే టట్టుగా వెక్కి వెక్కి ఏడుస్తోంది ఫాతిమా.

◆ ◆ ◆

ఏటివాలు వెంట పూలతెప్పలో షికారులా సాగిపోయింది చింతామణి చదువు. ఎస్సెసెల్సీ పరీక్షలో స్కూలు కంతా మొదటి మార్కులు వాడికే వచ్చాయి. బహుశా మా తాలూకాకు, కాదా జిల్లా అంతటికీ మొదటి మార్కులువాడివే నేమో! ఎవరు చూచారు? "అవసరమైతే కాలేజీమెట్టు ఎక్కించే భారంగూడా మీదే నండీ అయ్యగారూ!" అన్నాడు ధర్మయ్య. భారమాయిది? ఎగ్జిబిషనుకు ఒక అపురూపమైన వస్తువును తీసుకెళ్ళడం? వాడి సర్టిఫికెట్టును తెరచి చూపిస్తే చాలు, తాళం తనంతటదే విచ్చుకోగా, కాలేజి గేటు తలుపులు రంయిమని తెరుచుకోగలవని నాకు తెలియదా? కానీ నాకంత బాగా తెలియని విషయాలు కొన్ని లేకపోలేదు. ఏ కాలేజీలో చేర్చాలి? ఏ గ్రూపు తీసుకోవాలి? భోజన సదుపాయాలు ఎలా సమకూరేటట్టు? ఈ ప్రాథమిక ప్రయత్నాలమీద ఒకానొక పాత

శిష్యుడికోసం ఇంకొక దూరపు బంధువుకోసం పట్టణంలో నాకింక పరిచయమున్న మరికొందరు పెద్దమనుషుల కోసం చింతామణిని వెంటబెట్టుకుని నేను నగర వీధుల్లో తిరుగుతుండగా, ఏ తీగకోసమైతే నేను వెదకడంలేదో ఆ తీగ ఒకటి నాకడ్డు తగిలింది. గొంతెత్తి పిలుస్తూ అతడు నావైపు కొచ్చేస్తున్నాడు. పిలుస్తున్నది నన్నేనా? ఔనేమోననిపించింది. మసిమరకవల్ల అసలు రంగేదో తెలియకుండా పోయిన షరాయిపైన అతడు కాకి అర చొక్కా వేసుకున్నాడు. కాయకష్టం చేయడానికి అలవాటుపడిన వాడేమో, మనిషి మాత్రం శలాకలా వున్నాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళే కోడెత్రాచును తరిమి పట్టుకునే ఉత్సాహం అతడి ముఖంలో సందడిస్తూ వుంది.

పేవ్‌మెంట్ పైన సాగిలపడి, సాష్టాంగంగా నమస్కరించడం ఒకటి మినహాగా అతడు మిగిలిన మర్యాదలన్నీ పూర్తిచేశాడు. "నమస్కారమండీ మేష్టరు గారూ! నన్ను గుర్తు తెలియడంలేదా మీకు! నేనండీ! ఫక్రుద్దీను కొడుకుని! ఖాదర్బాషాని! మీరు కాలికి తుందుతగిలించిన వాణ్ణి!... ఏమిటోయ్ చింతామణి! నువ్వు గూడా మరచిపోయావా నన్ను?"

"నువ్వట్రా బాషా!" ఎక్కడ మునిగి ఎక్కడ తేలావురా బాబూ? ఇంతకాలం ఎక్కడున్నావురా నువ్వు?" అన్నాను తెల్లబోతూ!

"నేనుండడం యిక్కడేనండీ!" అన్నాడు బాషా. అంటూ అతడు వ్రేలితో నిర్దేశించిన చోట అరిగిపోయిన యినప చక్రాలు, పాతగిల్లిన టయర్లు, డబ్బారేకులు, కార్లు, వ్యాన్‌లు మొదలైన వాహనాలు తాలూకు శిథిల కంకాళాలు కుప్పలు తిప్పలుగా పడివున్నాయి.

"మీ దయవల్ల దగ్గర దగ్గరగా నేనూ ఒక పనివాడినే ననిపించుకుంటూన్నానండీ" అంటూ ముగించాడు.

నాకు కాస్తా కోపం రావాల్సిన సందర్భమే! అయినా తమాయించుకున్నాను. "పైగా యిదొకటా! నువ్వు నా దయను నీపైకి ఎక్కడ రానిచ్చావురా బాషా! పంగనామాలు పెట్టేశావుగా! మీ అయ్యకు చదువనేది కొరగాని వస్తువై పోయింది. అంతకు ముందే మీ అమ్మ దీనిపైన శీతకన్ను వేసింది. నువ్వాదీంతో అక్కరలేదనుకోడం వల్లనే యిలా దేశాలపైనబడ్డావు."

ఖాదర్బాషా నవ్వాడు– "ఆ మాటకొస్తే యిప్పుడు చింతామణికి మాత్రం చదువులతో ఏమంత అక్కరొచ్చి పడిందండీ మేష్టరుగారూ! చదువుకుంటే అందుమూలంగా మంచి ఉద్యోగం దొరికితే నాలుగు రాళ్లు కళ్ళబడవచ్చునన్న భరోసా లేదనుకోండి. అప్పుడు చింతామణి అయినా చదివేవాడేనంటారా?"

గడిచిపోయిన ఏడెనిమిదేళ్ళలో వీడేది నేర్చుకున్నా, ఏది నేర్చుకోకపోయినా మాటలు మాత్రం బాగానే నేర్చినట్టున్నాడు. చాలనిదానికి అందులో కాస్తా వ్యంగ్యం గూడా వుండి ఏడ్చిందాయె! ఈసారి గోడకు వేసి కొట్టిన బంతిలా నా కోపం నాపైకే ఎదురు తిరిగింది. గాడిద దగ్గర గంధవోడి ప్రస్తావన తెచ్చినందుకు నాకీ శాస్తి కావల్సిందే!

ఖాదర్బాషాను గురించి తెలుసుకోవాలన్న కుతూహలాన్ని కట్టగట్టి పారేసి "సర్లే వెళ్దాం పదవోయ్ చింతామణీ!" అంటూ ముందుకు సాగాను. పది పదిహేను బారల దూరం వెళ్ళిన తర్వాత చింతామణి నన్ను వెన్నంటి రావడంలేదని తెలిసింది. తిరిగి చూద్దునుగదా, ఈ ప్రబుద్ధుడు ఆ బడుద్ధాయి భుజంపైన చేయివేసి ఆప్యాయంగా వీడ్కోలు మాటలు వల్లిస్తున్నాడు.

"సాయంకాలం ఇక్కడుంటావుగద్దూ! తప్పకుండా వస్తాను. కలిసి ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలి. సరేనా బాషా!"

వీడు, ఈ కాబోయే కాలేజీ స్టూడెంటు పార్కుల్లో, విహరించవలసిందిపోయి, ఏ చెరువుగట్టుకో షికారు వెళ్ళవలసిందిపోయి ఒంటికి మసిపూసుకునే ఒక కారు మెకానిక్కుతో యిష్టాగోష్టికింద ఓ మంచి సాయంకాలాన్ని పాడుచేస్తాడా? చెవులు నులిమి గట్టిగా ఓ చెంపపెట్టు పెట్టాలన్నంత కోపంవచ్చింది. కానీ పదిహేనేళ్లు దాటిన కుర్రవాణ్ణి స్నేహితుడుగా చూచుకోవాలన్న నీతిమాట జ్ఞప్తికి రావడంతో యిక్కడ కఠినంగా మందలించడంకన్నా సజావుగా నచ్చజెప్పడమే సబబనిపించింది.

"వెధవ బుద్ధు లెక్కడికి పోతాయిలే చింతామణీ!" అన్నాను ఉన్నట్టుండి.

"మేష్టరుగారూ! నేనేం తప్పు చేశానండీ!" అంటూ గింజుకున్నాడు చింతామణి.

వాడి అమాయకత్వానికి నాకు నవ్వొచ్చింది. "అబ్బే, నిన్ను గురించి కాదు నేను చెప్పడం! ఆ ఖాదర్బాషాని గురించి!"

"వాడుమాత్రం ఏంతప్పు చేశాడండీ. ఎన్ని కష్టాలు పడ్డాడో ఏమిటో. తానొక ప్రయోజకుడు కాగలిగినట్టు చెబుతున్నాడు. చేతిలో పనుంది. పొట్ట పోసుకోలేక పోడు..."

"చూచావా చింతామణీ! అదే పొరబాటు. పొట్ట బోసుకుంటూ బ్రతుకు వెళ్ళదీయడానికి మానవ జన్మే కావలసి వచ్చిందా? పశుపక్ష్యాదులు కూడా ఆ పనిచేస్తున్నాయి. మనకంటే బాగానే చేస్తున్నాయి. మనిషిగా పుట్టినందుకు చతుర్విధ పురుషార్థాలను సాధించాలి. ధర్మార్థ కామమోక్షాలని వున్నాయిలే! కొడుకు యొక్క ధర్మం ఏమిటి? తల్లిదండ్రులకు సంతోషం కలిగించడం, వీడేం చేశాడు? చెప్పకుండా యింటి దగ్గరనుంచి ఉడాయించేశాడు. ఇన్నేళ్ళుగా యిక్కడుంటున్నాడుగదా! మాట మాత్రమైనా

కబురు తెలియనిచ్చాడు కాదు. ఈ ఆకతాయి వెధవ కోసం ఆ కన్న తల్లి కంటనీరు పెట్టుకోని రోజులేదు! తల్లిదండ్రుల విషయంలోనే యింత లక్షణంగా ప్రవర్తించిన వాడు యిక వీడు స్నేహధర్మాన్ని మాత్రం ఎంతవరకు పాటిస్తాడు? ఏమోనబ్బా! ఇలాంటివాడు తిరగని చెడ్డ తిరుగుళ్ళుంటాయా? రిక్షావాళ్ళతో, జేబు దొంగలతో, రౌడీమూకతో స్నేహాలుండనే వుంటాయి. నీ పైన వీడి నీడ పడటం గూడా ప్రమాదమే! నువ్వెక్కడుంటావన్న ఆచూకీ వీడికి తెలియకపోవడం చాలామంచిది!"

"అలాగేనండీ!" అన్నాడు చింతామణి ఆ మాటలో లేశమాత్రంగా ఏడుపుజీర వినిపించినట్టు నాకు తోచింది.

ఎంతగా తీపిపూత పూసినా మందు మందే! అలాగని రోగికి మందివ్వడం మానేస్తామా?

చింతామణి నా ప్రియశిష్యుడు. వాడి దారి నిష్కంటకంగా వుండాలన్నది నా కోరిక. కాలికి గుచ్చుకున్న ముల్లును ఓ పెద్దమనిషి కాల్చి బూడిదచేసి పానీయంలో కలిపి గుట గుట త్రాగేసిన ఉదంతం గురించి నేను విని వున్నాను. చింతామణి కంతటి తెగువ లేకపోవచ్చు గాక, వాడు నడిచే దారిలో ఖాదర్బాషా లాంటి ముళ్ళను ఏరివేయడానికి నేను సిద్ధంగా వున్నాను.

ఆదినుంచీ నేనాశించినట్టుగానే చింతామణికి కాలేజి సీటు అశ్రమంగా లభించింది. మరింత ఆశావహంగా మంచి గ్రూపు తనంతట తానుగా వాణ్ని వరించింది. ఎటొచ్చీ ఆ కాలేజీకొక హాస్టలు లేకపోవడ మొక్కటే కొరత. హోటల్లో భోజనానికి ఏర్పాటు చేసి, ఉండడానికొక రూము కూడా నేనే చూచిపెట్టాను. పెద్ద పెద్ద ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు నివసించే ప్రాంతం. నాగరిక ప్రపంచానికి దూరంగా బ్రతికిన పల్లెటూరివాడు చింతామణి. అలాంటివాళ్ళతో కలిసి జీవిస్తే కొబ్బరి కాయలోకి నీళ్ళు వచ్చినట్టుగా సంస్కారం గూడా తనంతటదే జీవితంలో చోటు చేసుకుంటుంది.

నేను ప్రయోగించిన రాకెట్టు గురితప్పడం లేదు!

ఆ సంతృప్తితోనే స్వగ్రామానికి తిరిగి వచ్చేశాను.

◆ ◆ ◆

చింతామణి ఆ సంవత్సరం దసరా సెలవుల్లో వచ్చేటప్పటికి, నేను మా అమ్మాయి పెళ్ళి ప్రయత్నాల్లో వున్నాను. వాడిని దగ్గర కూర్చోబెట్టుకుని తీరామారా ఓ అరగంట సేపయినా మాట్లాడ్డానికి వీల్లేకపోయింది. "బాగా చదువుకుంటున్నావా?" అన్నాను.

అవునన్నట్టు చింతామణి తల వూపాడు. "పరవాలేదండీ! ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్నాను" అన్నాడు. పట్నానికి వెళ్ళడానికి ముందుగా సెలవు తీసుకోడానికి వచ్చినప్పుడు "క్రిస్మస్ సెలవులో క్లాసులుంటాయేమోనండీ మేష్టరుగారూ! రావడం కుదరకపోవచ్చు" అన్నాడు. "క్లాసులుంటే రావడం దేనికీ? హాయిగా అక్కడే చదువుకో, వచ్చి వెళ్ళడానికి కావలసి వచ్చేటంత డబ్బుంటే అక్కడ శుభ్రంగా హోటలు ఖర్చులకు సరిపోతుంది కూడాను..." అన్నాను.

ఈ సంభాషణ నడుమ నడుమ నేను అడక్కుండా దాటవేస్తూవచ్చిన ప్రశ్న ఒకటి లేకపోలేదు. "ఖాదర్బాషా ఎప్పుడైనా కనిపిస్తున్నాడా?" అన్న ప్రశ్న ఎన్నోసార్లు నాలుక చివరిదాకా వచ్చింది. గొంతుక బంటిదాకా కాలేజీ చదువుల్లో మునిగిపోయినవాడికి ఖాదర్బాషా లాంటి వాణ్ణిగురించి ఆలోచించే తీరిక ఎక్కడుంటుంది? పీడ కలలాంటి ఆ విషయాన్ని నేనెందుకు గుర్తుచేయాలి?

చింతామణి దగ్గరినుంచి నాకు నెల కొకటి రెండు ఉత్తరాలు వస్తుండేవి. వీలయినంత ముక్తసరిగా అతడు తన ఉత్తరాలు ముగించేవాడు. తాను చదువుకోవడంలో లోపం జరపలేదని నాకు పరిపరి విధాలుగా నచ్చ చెబుతున్నట్లుండేవి వాడి జాబులు. చింతామణి కిప్పుడొకరు కొత్తగా పొదుపును గురించి చెప్పవలసిన పనిలేదు. పొదుపరితనం ఆవశ్యకతను గురించి కుటుంబ పరిస్థితులే వాడికి నేర్పించాయి. వాడి దగ్గరినుంచీ ఎప్పుడొచ్చినా కార్డు ముక్కలే వచ్చేవి. ఓ సారి అందుకు విరుద్ధంగా ఇన్‌లాండు కవరొచ్చేసరికి, కాస్త ఆశ్చర్యంగానే చించి చూశాను. చింతామణి అందులో నేనూహించడానికి వీల్లేని విషయం ఒకటి వ్రాశాడు. "మేష్టరుగారూ! ఈ మధ్య ఒక విచిత్రమైన విషయం జరిగిందండీ" అంటూ ప్రారంభమైంది వాడి కథనం. "ఆ రోజయితే నాకు నిజంగా ఏడుపొచ్చిందనుకోండి! ఎందు కంటరా? అప్పటికి నేనొక జత దుస్తులు తొడుక్కుని పదిహేను రోజులు దాటింది. మధ్యలో రెండు మూడుసార్లు వాటినే ఉతికి వేసుకున్నాను. మురికితో, ముడతలతో అవింక ఉతికినా వేసుకోడానికి వీల్లేనంత ఖరాబై వున్నాయి. ఇవి తప్పితే నీకింక బట్టల్లేవా అని అడిగేవాళ్ళకు బదులు చెప్పలేక నా ప్రాణం సగం చచ్చింది. ఇక్కడ మీకు ఉన్నట్టుండి నా బట్టలకేమొచ్చిందన్న సందేహం కలగవచ్చు. ఏం చెప్పమంటారు? నేనొక లాండ్రీవాణ్ని నమ్మి మోసపోయాను. ప్రతిరోజూ రెండు పూటలా పనిగట్టుకుని లాండ్రీకి తిరిగినా నా దీనపరిస్థితిని చూచి వాడికి జాలిలేక పోయింది. మీ బట్టలు వారం రోజులకల్లా రెడీగా వుంటాయన్నది వాడు మొదట చెప్పిన మాట! వాడు చెప్పిన రోజున, చెప్పిన టైముకు సరిగ్గా లాండ్రీలో హాజరయ్యాను. "రేపు

నుంచీ బట్టలు రావాలి, రాగానే యిస్త్రీకి వెళ్తాయి" అన్నాడు. ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలకు వెళ్ళి చూద్దునుగదా, గుడ్డలకడ్డంగా పడి చొంగ కార్చుకుంటూ అతడు ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నాడు. చిత్తుగా త్రాగి నిద్రపోయే లక్షణ మంతేనని తరువాత తెలిసింది. అప్పటి నుంచీ ఎందుకైనా మంచిదని సాయంకాలాల్లో బాగా చీకటి పడకముందే లాండ్రీకి వెళ్ళి రావడం అలవాటు చేసుకున్నాను. ఒకసారి చెప్పిన సాకు యింకొకసారి చెప్పకుండా వాడలాగే నాలుగైదు రోజులదాకా జాప్యం చేశాడు. ఆఖరు కొకనాడు "నువ్వు బట్టలు వేసి అప్పుడే రెండు వారాలైందా? ఏదీ, చీటి యిలా యివ్వు" అన్నాడు. ప్రోగ్రెస్ కార్డు కన్నా, ఫౌంటెన్ పెన్‌కన్నా జాగ్రత్తగా దాచిపెట్టుకున్న లాండ్రీ చీటీ జేబులో నుంచీ తీసి వాడిచేతిలో పెట్టాను. వాడా చీటీ వైపోసారి పరకాయించి చూచుకున్నాడు. అంతలో ఏదో జ్ఞప్తికి వచ్చినట్టు అలమరాలో సర్దిపెట్టిన యిస్త్రీ బట్టలన్నింటినీ పరిశీలించాడు "ఉండుండు" అంటూ ఓ బట్టల మూట విప్పి మాసిన గుడ్డల్ని కెలికి చూశాడు, ఇంతలో తనకు తెలిసిన వ్యక్తి ఎవరో వీధిలో వెళ్తున్నట్టు, అతడితో తనకేదో అర్జంటు పని వున్నట్టు నాలుగంగల్లో వీధి మెట్లపైకి వెళ్ళి, తన చేతిలో వున్న చీటీని తుంపులు తుంపులుగా చించి సైదు కాలవలోకి జారవిడిచేశాడు. నా బట్టల్ని ఆ లాండ్రీలో వేసినందుకు నాకున్న ఏకైకాధారం ఆ చీటీ ఒక్కటే! అది మురికి నీళ్ళల్లో పడి కొట్టుకుపోతుండడం చూచేసరికి నాకు మతిపోయింది. ఇక వెళ్ళిరమ్మన్నట్టు నా వైపు నిర్లక్ష్యంగా చూసి లాండ్రీవాడు తన పనిలో తాను నిమగ్నుడైపోయాడు. నేను గింజుకున్నాను, బాబ్బాబూ! నీకివ్వవలసిన దాని కన్నా రెండింతలు మూడింతలుగా డబ్బిచ్చుకుంటానని ప్రాధేయపడ్డాను. లాభం లేకపోయింది. వీధిలోకి వెళ్ళి పెద్దమనుషులుగా తోచిన వాళ్ళతో మొరపెట్టుకున్నాను. "ఏ వూరు బాబూ నీది?" అంటూ సానుభూతితో పలకరించడం తప్పితే వాళ్ళల్లో ముందుకొచ్చి యిందులో జోక్యంపెట్టుకునే వాళ్ళొక్కరూ లేకపోయారు. గంట తొమ్మిదిన్నర కావస్తోంది. ఇంకొక అరగటంలో నేను కాలేజీకి వెళ్ళాలి. మళ్ళీ రూముదాకా వెళ్ళి రావల్సిన పనిలేకుండా మాసినబట్టల్ని తీసి లాండ్రీలో పడవేసి, యిస్త్రీ బట్టలు తొడుక్కుని చక్కా అక్కడి నుంచే కాలేజీకి వెళ్ళిపోదామనుకున్నాను. నా ముఖానికి నాకింక యిస్త్రీబట్ట లెక్కడివన్న దుఃఖంలో నాకు నెత్తి బాదుకోవాలనిపించింది. డబ్బుంటే అప్పటికప్పుడు రెడీమేడ్ దుస్తులయినా కొనుక్కోవచ్చు. బస్సెక్కి వూరికి వచ్చేయాలన్నా జేబులో అయిదో, పదో వుండవలసిందే! దుస్తులు మార్చుకోకుండా కాలేజీకి వెళ్ళడం సాధ్యంకాదు. గదిలోకి వెళ్ళికూర్చుంటే ప్రొద్దుపోదు. పట్టణమంతా అప్పుడు నాకొక అడవిలా కనిపించింది. అడవిలో దారి దప్పినవాడిలా వీధుల వెంట పడ్డాను. ఏ పదకొండో, పన్నెండో అయివుంటుంది. ఎక్కడి నుంచీ చూచాడో, ఏమిటో ఖాదర్బాషా పరుగెత్తుకుంటూ

వచ్చేశాడు. "ఏమిట్రా బాబూ, ఈ పిచ్చివాలకం! కాలేజీకి వెళ్ళలేదా!" అన్నాడు. అదిరోడ్డు కావడంవల్ల వాణ్ణి కావలించుకుని బిగ్గరగా ఏడ్చే అవకాశం నాకు లేకపోయింది. ఏడుపు దిగమ్రింగుకుంటూ జరిగిన విషయమంతా చెప్పేశాను. "మరేం భయంలేదురా చింతామణి!" అన్నాడు బాషా. "ఇక్కడే వుండు, నాల్గంటల్లో వచ్చేస్తానంటూ" తుర్రున వెళ్ళిపోయాడు. వాడి ధీమా ఏమిటో నాకు తెలిసిందిగాదు. వాడు వెళ్ళిన దారివైపే చూస్తూ అక్కడే నిల్చుండిపోయాను. నాదగ్గరొక మోటర్ సైకిలు ఆగేదాకా నేనీ లోకంలోలేను. ఆ సైకిలెక్కి వచ్చిన వాడు ఖాదర్బాషాయేనంటే నమ్మశక్యం గావడంలేదు. పాంటుతో, కోటుతో బూట్లతో, కళ్ళజోడుతో వాడిప్పుడొక చిన్న పాళేగాడి ముద్దుల కొడుకులా వున్నాడు. "ఎక్కవోయ్ చింతామణి!" అంటున్నాడు ఖాదర్బాషా. సైకిలు కదిలింది. ఐదు నిమిషాలు గడిచేసరికి లాండ్రీలో వూడిపడ్డాం. "బుద్ధిగా మా వాడి బట్టలిస్తావా? ఇక్కడున్న మురికి బట్టలన్నీ తీసి మురికి కాలవలోకి గిరాట్టు పెట్టమంటావా?" అన్నాడు బాషా. ఏదీ పెట్టు చూద్దామన్న మాట లాండ్రీవాడి పెదవుల దాకా వచ్చింది. కానీ నోరుజారితే అన్నంత పనీ చేసేటట్టే వున్నాడు బాషా. లాండ్రీవాడు నీళ్ళు నమిలాడు. "ఎందుకూ నే నివ్వనన్నానా?" అన్నాడు. "ఇంటిదగ్గర వుండాలి. సాయంత్రం తీసుకొచ్చి యిస్తా" నన్నాడు. అదేం కుదరదంటూ బాషా కుర్చీలో బైఠాయించేశాడు. ఆ తరువాత జరిగిందంతా టూకీగానే జరిగిపోయిందనుకోండి! లాండ్రీవాడు చచ్చినట్టుగా ఇంటికి వెళ్ళొచ్చాడు. నా బట్టలు నాకొచ్చేశాయి..."

మరికొన్ని మామూలు వర్తమానాలతో ఉత్తరం పూర్తయింది. కానీ నేను చింతామణి గురించి సీరియస్‌గా ఆలోచించడం మాత్రం అక్కడనుంచే మొదలైంది.

♦ ♦ ♦

చింతామణి బుద్ధిమంతుడు, వయసుకు మించిన విజ్ఞానాన్ని వాడికి చదువుతోబాటుగా రంగరించిపోశాను. కానీ ఇంత అమాయకత్వం వాడిలో గూడుకట్టుకుని వుంటుందని నేననుకోలేదు. వెంటనే చికిత్స చేయకపోతే ఈ జబ్బు మరింత వెర్రితలలు వేయకపోదు. అందుకని ఘాటుగానే వో ఉత్తరం వ్రాసి పడేశాను.

"ప్రియమైన చింతామణి! నీ ఉత్తరం చేరింది. ఇక లేవనుకున్న బట్టలు తిరిగి లభించడంవల్ల నీకు అలివిమాలినంత ఆనందం కలిగి, ఆ వివశత్వం చల్లారక ముందే నువ్వీ జాబు వ్రాసి వుంటావని గ్రహించాను. బహుశా నీ మెతక తనాన్ని గుర్తించబట్టే, ఆ పుండాకోరు లాండ్రీవాడు అలాంటి దురాగతానికి పాల్పడి వుంటాడు. నీ అంతట నువ్వే వాణ్ణి సాధించవలసిపోయి యింకొకరి సాయాన్ని అపేక్షించవలసి రావడం

విచారకరం. ఇంతటి శుద్ధ బుద్ధావతారానివి గనుకనే నీకా ఖాదర్బాషాగాడి చర్య ఏ సిందుబాదు వాయేజి లాగానో, రాబిన్ హుడ్ అడ్వెంచరు లాగానో కనిపించి వుంటుంది. ఇంతకూ వాడు వేసింది పగటి వేషం. ఎక్కింది ఎరవలి వాహనం. నకిలీ సరుకుకే యింతటి మతింపువుంటే, యిక నికరమైన దానికి ఎంతటి విలువ వుంటుందో నువ్వర్థం చేసుకోవాలి. అసలు సిసలు దొరబిడ్డలు నీ కాలేజీలో నీ చుట్టూరా తిరుగుతున్న వాళ్ళల్లోనే బోలెడుమంది వుంటారు. చిన్నప్పటినుంచీ పట్టణంలోనే పెరగడంవల్ల అక్కడ ఏయేవ్యక్తితో ఎలా వ్యవహరించాలో వాళ్ళకు క్షుణ్ణంగా తెలిసివుంటుంది, ఏయే సందర్భంలో ఎలా ప్రవర్తించడం సబబో వాళ్ళను చూచి నువ్వు నేర్చుకోగలవు. అలాంటివాళ్ళ స్నేహమే నీకిప్పుడు కావలసింది. ఈ విషయం నీతో ఎన్నోసార్లు చూచాయగా చెప్పేవున్నాను. మళ్ళీమళ్ళీ చెప్పించుకోవలసినవాడివి కావు. గ్రహించవలెను...”

ఉత్తరం పూర్తిచేసి పోస్టుచేస్తుండగా నాకొక పోలిక స్ఫురించింది. ఇదంతా రాకెటు కేంద్రం నుంచి రోదసీనౌక మార్గాన్ని సరిదిద్దే ప్రయత్నమైపోయింది. ఈ ఖాదర్బాషా అనేవాడు చింతామణి పాలిటికొక పీడలా దాపురించాడు. వాడి ప్రభావం నుంచీ బయటపడడమనేది, వీడికి కొన్ని పరిచయాలు, స్నేహాలు పెంపొందించినప్పుడు మాత్రమే సాధ్యం.

సంక్రాంతి పండుగకు ముందుగా ఒకసారి యింటి పనులమీద పట్నానికి వెళ్ళి రావలసి వచ్చింది. అక్కడున్న ఒకటి రెండు రోజుల్లో చింతామణి మాటల్లో బాషా ప్రసక్తి వీలయినంత తక్కువగా వినిపించడం గమనించాను. అందుకు బదులుగా నారాయణ అనీ, నాగరాజనీ, పరమానందమనీ కొత్త మిత్రులెవరో వాడి జీవితంలో చోటు చేసుకోవడం నాకెంతో సంతృప్తిని చేకూర్చింది.

చింతామణి ద్వారా ఆ స్నేహితులను గురించి కొద్దిపాటి వివరాలు ఆరా తీశాను కూడా!

నారాయణ తండ్రి పల్లెలో ఎక్కడో భూస్వామి. పట్టణంలో ఆయన కొక యిల్లుంది. ఆ యింటిపైన వచ్చే అద్దె డబ్బులను స్వయంగా తనే వాడుకుంటూ నారాయణ కాలేజీలో చదువుకుంటున్నాడు. నాగరాజొక మున్సిపల్ కౌన్సిలర్ కొడుకు. వృత్తిరీత్యా ఆ కౌన్సిలరొక కంట్రాక్టరు తన వ్యాపకాల్లో తనకు తీరికలేక ఆయన ఛేర్మన్ కాలేదు. కానీ తనమాట జవదాటని వ్యక్తినే ఛేర్మన్‌గా చేస్తూ 'కింగ్ మేకర్' అనిపించుకుంటున్నాడు. తాశీల్దారుగా పనిచేసి రిటయిరై చనిపోయిన వామనమూర్తి గారి రెండో భార్య సంతానం పరమానందం. వామనమూర్తిగారి మొదటి భార్య బిడ్డలను బాగా చదివించి పెళ్ళిళ్ళు చేశారు. రెండో

భార్యకొక దారి చూపించకుండా వెళ్ళరాదన్న ఉద్దేశంతో ఆస్తిపాస్తుల నన్నింటిని ఆమె పేరిట వ్రాయించి పోయారు. ఆ రెండో భార్య కొక్కడే కొడుకు పరమానందం.

వివరాలు విన్నతర్వాత "వాళ్ళేమైనా బాగా చదువుకునే వాళ్ళేనా?" అన్న ప్రశ్న అడిగి వుండవలసింది. కానీ అదెందుకో ఆ ప్రశ్న గొంతుకలో సుళ్లు తిరిగిందేగానీ పెగిలి వెలుపలికి రాలేకపోయింది.

ఐతే వేసవి సెలవులకింక నెలరోజులుందనగా చింతామణి వ్రాసిన ఒక ఉత్తరంలో పై ప్రశ్నకు సమాధానం దొరికింది.

"మేష్టరుగారూ! నేను చెబితే మీరు నమ్మరేమో! పదిహేను రోజుల క్రిందట పరీక్షలకు ప్రిపేర్ కావడం కట్టిపెట్టి, పెట్టే బేడా సర్దుకుని యింటికి వచ్చేద్దామనుకున్నాను" అంటూ ప్రారంభమైంది ఉత్తరం.

ఇదేం ఘోరకలి?

"బొత్తిగా చదువుకోలేక పోయాననుకోండి! రాత్రి ఎనిమిదింటికల్లా భోజనం చేసి రూము కొచ్చేస్తాను. పుస్తకం తెరిచేటప్పటికీ వీళ్ళు సిద్ధమైపోతారు. ఒకడు పాట, ఇంకొకడు పెట్టే పైన మద్దెల, తిక్కమళ్ళితే మూడోవాడు డ్యాన్సు. తొమ్మిదిన్నరదాకా ఆవిధంగా గానాబజానా! ఆపైన అలా అలా కొంతదూరం షికారు వెళ్ళొద్దామంటారు. ముగ్గురిలో ఎవడి జేబులో డబ్బున్నా సినిమా ప్రోగ్రాం తప్పనిసరి! నాకైతే తెలుగు సినిమాలంటనే యిష్టం. ఇంగ్లీషు పిక్చరేదీ లేకపోతే, వాళ్ళు నన్ను ఈడ్చుకెళ్ళేది హిందీ సినిమాకే! రాత్రి రెండు గంటలప్పుడెప్పుడో పడుకుంటే, తెల్లవారుజామున మెలకు వెక్కడొస్తుంది? పగటి వేళ నిద్రమత్తులో పాఠాలు మాత్రం ఏమర్థమవుతాయి? వీళ్ళతో నాకొచ్చిన గొడవిదొక్కటే గాదు, పరమానందమున్నాడే వాడు చెయిన్ స్మోకరు. మిగిలిన వాళ్ళిద్దరూ అందులో యిప్పుడిప్పుడే వాడికి సమవుజ్జీలు కాగలుగుతున్నారు. అసలు వాళ్ళు నా రూముకు రావడం నిర్భయంగా సిగరెట్లు కాల్చుకోడానికేనట! సిగరెట్టు కంపుతో గాలి కలుషితమై పోవడంవల్ల రూము తలుపులు తెరిచేసరికి, ఊపిరాడక ప్రాణాలు విలవిలలాడిపోయేవి. తెల్లవారగానే బుట్టెడు సిగరెట్టు పీకలను ఏరి పారవేయడం నా కాలకృత్యాల్లో ఒకటిగా పరిణమించింది. అంతటితో నన్ను వదిలిపెడితే వాళ్ళకొక నమస్కారం పెట్టేవాణ్ణి! మహానుభావులు, నన్ను కూడా కాల్చి చూడమని ఒత్తిడి చేశారు. ఎంతకూ నేను వినకపోయేసరికి ఇద్దరు నా చేతులు గట్టిగా పట్టుకోగా, మూడోవాడు పెదవుల మధ్య సిగరెట్టును యిరికించి, అగ్గిపుల్లగీసి ముట్టించాడు. "మన్నించండి! బలవంతంపైన నేను పొగపీల్చక తప్పలేదు, ఫలితం రెండుసార్లు తిన్నదంతా వమనం కావడం!" ఆదిలో

అంతేనట! క్రమక్రమంగా అలవాటవుతుందన్నారు. మనవూరి దొంగల మర్రిలో దయ్యాలున్నాయని చెప్పేవాళ్ళు. అయినా నేను భయపడకుండా అక్కడికి వెళ్ళి రాగలిగేవాణ్ణి. ఈ దయ్యాలతో మట్టుకు నేను వేగలేకపోయాను. ఇలా కాదని, రాత్రి భోజనం కాగానే రూముకు రాకుండా పార్కులో కూచుని చదువుకోసాగాను. ఆ వారం రోజుల్లో వీళ్ళకు పిచ్చి పట్టినట్టయింది. ఎక్కడెక్కడో తిరిగి కడకు నా ఆచూకీ కనిపెట్టేశారు. "అప్పటికి నువ్వొక్కడివే బుద్ధిమంతుడివై పోదామనుకుంటున్నావా?" అన్నారు. 'బయలుదేరాడురా విద్యాసాగరుడు!' అన్నారు. చూస్తుండగానే నాచుట్టూ భజన ప్రారంభమైపోయింది. కొట్టకుండా బయటికి సాగనంపడమే వాచ్‌మెన్ మాకు చేసిన మర్యాద. నిక్కచ్చిగా వాళ్ళని రూముకు రావద్దని చెప్పేశాను. మమ్మల్ని రాకుండా ఆపడం బ్రహ్మకైనా తరంగాదు పొమ్మన్నారు. వాళ్ళతో మాట్లాడకుండా భీష్మించుకున్నాను. సాధ్యంకాలేదు. చక్కిలిగింతలు పెడతారు, ముఖంపైన ముఖం పెట్టి పళ్ళికిలిస్తారు. గిల్లికజ్జాకు పిలుస్తారు. రోడ్డుపైన నా పోటుకు నేనొస్తుంటాను, వెనకనుంచీ రకరకాల పేర్లు పెడుతూ వాళ్ళు నా వెంట తగులుకుంటారు. ఈ దాడికి నిభాయించుకోడం నా తరం కాలేదు..."

ఇంతవరకూ వ్రాస్తూ వచ్చి ఎలా కొనసాగించాలని తోచకపోవడం వల్ల గావచ్చు. నాలుగైదు పదాలు వ్రాసి మళ్ళీ కొట్టేశాడు చింతామణి. చివరకు క్రొత్త పేరాగ్రాఫ్ ప్రారంభించాడు.

"నేనేం చెయ్యగలనండీ మేష్టరుగారూ! ఎందుకో తెలియదు. నేను ఖాదర్బాషాని గురించి చెప్పడం మీకిష్టం వుండదు. ఐనా చెప్పక తప్పదు. వాడొక్కడే లేనట్టయితే ఈ జాబు ప్రారంభంలో రాసినట్టు నేనీ పాటికి మన వూళ్ళో వుండేవాణ్ణి. ఏదైనా సలహా యిస్తాడేమోనని జరుగుతున్న విషయమంతా వాడి చెవిలో వేశాను. బాషా తలపంకించాడు. సరే. వెళ్ళమని నన్ను పంపించేశాడు. వాడి ప్లానేమిటో నాకు తెలియదు. రెండు రోజులు గడిచాయి. ఆనాటి రాత్రి తొమ్మిది గంటలై వుంటుంది. నామెడకు గుదిబండలా తగులుకున్న నా మిత్రులు ముగ్గురూ అప్పటికొక గంటసేపటినుంచీ సాగిస్తున్న హంగామా హఠాత్తుగా ఆగిపోయింది. ఇందుకు కారణం గుమ్మానికడ్డంగా నిలబడివున్న ఓ ఆకారం, ఖాదర్బాషా ఇప్పుడు గళ్ళలుంగీ కట్టుకున్నాడు. చేతుల్లేని బనీను తొడుక్కున్నాడు. ఆ కత్తెర మీసాలు యిందుకని స్పెషల్‌గా కత్తిరించినట్టున్నాయి. బుట్టలా పైకిరేగి, పడగలా నుదురుపైకి వంగిన క్రాపింగు, పాచి, తూచి, ఒక్కొక్క అడుగేవేస్తూ బాషా గదిలోపలికి వచ్చేశాడు. ముందుగా పరమానందం చెవులు రెండూ పట్టుకుని చులాగ్గా లేపి నిల్చోబెట్టాడు. మోకాలు పైకెత్తి, వీపుకు తగిలేటట్టుగా ఓ 'కిక్' యిచ్చాడు. ఆ దెబ్బతో పరమానందం వసారాలోకి

కొట్టుకపోయాడు. అక్కడ చీకటిలో వొదిగి వుండడంవల్ల అందాకా కనిపించకుండా వున్న ఫహిల్వానులిద్దరు ముందుకొచ్చి చెరొక రెక్క పట్టుకుని పరమానందాన్ని తీసుకెళ్ళి నడివీధిలో నిల్చోబెట్టారు. అంతపనీ జరిగాక యిక తమపైన చేయిగానీ, కాలుగానీ చేసుకోవలసిన అవసరం లేకుండా నారాయణ, నాగరాజు పిల్లుల్లా బయటికి జారుకున్నారు. ఆ ముగ్గుర్నీ ఒక మందగా తోలుకెళ్ళి వీధి మొనలో వున్న వేపచెట్టు క్రీనీడలో నిల్చోబెట్టారు. "భద్రం, భద్రం! ఇకపైన ఎప్పుడైనా ఈవైపు తిరిగి చూచారంటే మీ పళ్ళు మీవిగావు. మీ వొళ్ళు మీదిగాదు. రోడ్లపైన ఎక్కడైనా వెంటపడి గలాటా చేశారంటే చిత్తు చిత్తుగా చావగొట్టి చెత్తడబ్బాలో కుక్కేయడం నాచేతనౌను ఖబడ్దార్! తిరిగి చూడకుండా-పరుగెత్తండి!" అన్నాడు బాషా, వాళ్ళ అవస్థ చూచి తీరవలసిందే! తోక తెగిన నక్కలు అంతకంటే నయం!"

జాబు చదివి ముగించగానే సముద్రంలో నా వ్యాపారనౌకలేవో మునిగిపోయినట్టు, యుద్ధంలో ఘోరపరాజయానికి గురైనట్టు నేను కృంగిపోయాను. ఎవడి ప్రభావం నుంచి నేను చింతామణిని విముక్తం చేయాలనుకున్నానో, వాడే చింతామణికి పెద్ద దిక్కుగా వుండి ఆదుకోడంతో నా పథకమంతా తల్లక్రిందులై పోయింది. నేనిచ్చిన అవివేకపు సలహావల్ల కలిగిన అనర్థాన్ని బట్టి, నా లోక జ్ఞానాన్ని గురించి చింతామణికి చాలా హీనమైన అభిప్రాయం ఏర్పడేవుంటుంది. బహుశా పరిస్థితి యిలా వెక్కిరించిన సందర్భంలోనే గిరీశం "డామిట్! కథ అడ్డం తిరిగింది" అని చెప్పి వుంటాడు.

నేను చేయగలిగిందల్లా ఆ వుత్తరానికి ప్రత్యుత్తరం వ్రాయకుండా వూరుకోడమే! వ్రాస్తే తప్పనిసరిగా ఖాదర్బాషాను అభినందించాలి. వాడిని అభినందించడమంటే నన్ను నేను అభిశంసించుకోడమే!

వేసవి సెలవుల్లో యింటికి వచ్చినప్పుడు చింతామణిలో ఒక మార్పు స్పష్టంగా కానవచ్చింది. వాడిప్పుడు నా దగ్గర అదురూ బెదురూ లేకుండా, తాను చెప్పగలిగిన వాటిలోనూ, నేను వినగలిగిన వాటిలోనూ అంతకంటే ఉత్కృష్టమైన విషయం మరొకటి లేనట్టు ఖాదర్బాషాని గురించి మాట్లాడేస్తున్నాడు.

"చూడండి మేష్టరుగారూ! ఏడెనిమిదేళ్ళ వరకూ వాడు తన అద్రసొకరికి తెలియకుండా అజ్ఞాతంగా వుండిపోయాడుగదండీ! ఎందుకలా చేశావని అడిగాను..."

ఏమన్నాడేమన్నాడంటూ నేను కుతూహలం కనబరచాలని వీడి వుద్దేశమేమో! నేను వీలయినంత ముభావంగా వుండిపోయేవాణ్ణి!

"ఇప్పుడైతే చేతిలో ఒక పనుంది, నాలుగు రూకలు సంపాదించుకుంటున్నాడు. మొదట మొదట పడరాని కష్టాలు పడ్డాడటండీ పాపం! అప్పుడు తన ఆచూకీ తెలిస్తే అదనంగా బెంగ ఒకటి తప్పితే తల్లిదండ్రులకు ఒరిగేదేముంది? అందువల్ల తన బాధలేవో తానే పడ్డాడు. ఏమైనా వాడి బుర్రలో విద్యుత్తులాంటి తెలివితేటలున్నాయండీ మేష్టరుగారూ! మూత విడదీసి యింజను వైపొకసారి చూస్తేచాలు, ఎక్కడ పొరబాటుందో చిటికెలో గ్రహించేస్తాడు. కార్లు, బస్సులు, లారీల్లాంటి వన్నీ వాడి చేతిలో ఆట బొమ్మలే ననుకోండి! నేను చెబుతున్నానుగా, మనం చూస్తూ చూస్తూ వుండగానే వాడి జాతకం మారి తీరుతుంది..."

"పోనీ నీ కాలేజి చదువులెలా ఉన్నాయో చెప్పవేంరా చింతామణీ!" అంటూ వాడి ధ్యాసను వేరొక ప్రక్కకు త్రిప్పడానికి ప్రయత్నించేవాణ్ణి–

"ఏం కాలేజీయో లెండి? వచ్చిన గొడ్డును కట్టెయ్యరు. వెళ్ళిన గొడ్డును వెదుక్కోరు. ఎవరికష్టం వారిది, గురుశిష్య సంబంధమనేది హైస్కూలుతోనే ఆఖరేమో ననిపిస్తుంది. నా మట్టుకు నేను శ్రద్ధగానే పాఠాలు వింటున్నాను. అక్కరగానే చదువుకుంటున్నాను. పరీక్షలో మార్కులెలా వస్తాయో చూడాలి..."

"అవునవును, మార్కులు రావడం ముఖ్యం"– మార్కుల ప్రసక్తి రావడంతో అంతకన్నా ముఖ్యమైన విషయం ఒకటి జ్ఞప్తికి వచ్చింది.

"అన్నట్టు నీ స్కాలర్‌షిప్పు సంగతేమైనట్టు?"

"అప్లయి చేశాను. ఏదొస్తుందో తేలలేదు. మెరిట్‌తోబాటు, కాండక్టు కూడా చూచి యిచ్చే స్కాలర్‌షిప్పు ఒకటుందట. అది ప్రిన్సిపాలుగారు రికమెండ్ చేయడంపైన ఆధారపడి వుంటుంది."

"కావచ్చు, ప్రిన్సిపాల్‌గారా పని చేయడానికి ఆయన దగ్గరికి ఒక మంచి రికమెండేషన్ తీసుకెళ్ళాల్సి వుంటుందేమో! ఆ విషయం ఆలోచించావా చింతామణి."

"వాకబుచేసి చూచాను. మంచి రెకమెండేషన్ తీసుకెళ్ళ గలిగిన వాడికి సంఘంలో ఎంతో కొంత పలుకుబడి వుంటుంది. ఆ మాత్రం పలుకుబడి వున్నా వాడు స్కాలర్‌షిప్పు లేకపోయినా చదువుకోగలడు. ఇదిటండీ ప్రిన్సిపాల్‌గారి వాదం."

అమ్మో, అఖండుడేనే అనుకున్నాను.

రెండో సంవత్సరం ప్రారంభంలో చింతామణిని కాలేజికి పంపించవలసి వచ్చేసరికి ధర్మయ్య ప్రోనోటుపైన అయిదు వందల రూపాయలు అప్పుచేయవలసి వచ్చింది. "అవసర

నిమిత్తం కుమారుడి చదువు ఖర్చులకోసం" అని వ్రాస్తూ యిలా మరెన్నిసార్లు వ్రాయవలసివస్తుందో ననుకున్నాను.

ఐతే అలాంటి ఆవశ్యకత మళ్ళీ మళ్ళీ ఏర్పడకుండా అనతికాలంలో చింతామణికి అతడాశిస్తున్న స్కాలర్‌షిప్పు లభించింది.

ఈసారి చింతామణి వ్రాసిన ఉత్తరంలో వున్నది తనకు స్కాలర్‌షిప్పు లభించిన వర్తమాన మొక్కటేకాదు, నా అహంకార ప్రత్యయాన్ని కాల్చి బూడిద చేసిన ఉదంతం కూడా అందులోనే వుంది.

ఒకరోజు ప్రిన్సిపాల్‌గారి వద్ద నుంచి చింతామణికి కబురొచ్చిందట! వెళ్ళాక వీడి వాలకాన్ని ఎగాదిగా ఒకసారి చూచాడు ప్రిన్సిపాలుగారు. తండ్రి వ్యాసంగం, స్థితిగతులు మొదలైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సెస్సెల్సీ పరీక్షలో వచ్చిన మార్కులు కూడా వెరిఫైచేసి చూసుకన్నాక "ఇంటర్‌లో బెస్టు స్టూడెంటుకిచ్చే స్కాలర్‌షిప్పును నీకే రెకమండ్‌చేస్తున్నాను" అన్నారట!

ఎవరికైనా ఆనందం కలిగే సందర్భమే! చింతామణి కృతజ్ఞత వెల్లడించాడు.

సెలవుతీసుకుని వచ్చేయబోతుండగా "ఇక్కడ నీకెవరైనా స్నేహితులున్నారా" అంటూ ఓ చిత్రమైన ప్రశ్న అడిగారట ప్రిన్సిపాలుగారు.

చింతామణి తెల్లబోయాడు. "ఇక్కడ నా కెవరూ స్నేహితులు లేరండీ!" అని ప్రత్యేకించి ఏ స్టూడెంటు పేరూ చెప్పకుండా. అక్కడి స్నేహాలు చదువుకు దోహదం చేసేవిగా కనిపించలేదని చింతామణి భయం, భయంగానే మనవి చేశాడట!

"కాలేజీ సంగతి వదిలిపెట్టు! కాలేజికి బయట ఎవరైనా స్నేహితులుండొచ్చు గదా!" అన్నారు ప్రిన్సిపాలుగారు.

అప్పుడుగానీ చింతామణికి బాషా సంగతి జ్ఞప్తికి రాలేదు. "ఉన్నారండీ! వాడిపేరు ఖాదర్బాషా. ఎలిమెంటరీ స్కూల్లో కలిసి చదువుకున్నాం. వాడిక్కడ ఒక వర్క్‌షాపులో పనిచేస్తున్నాడు" అన్నాడు చింతామణి.

"చూడబ్బాయ్! ఆ సంగతి చెప్పడానికే నిన్నిక్కడికి పిలిపించాను. ఈ మధ్య నా కారు చెడిపోయింది. అర్జంటుగా రేపే హైద్రాబాద్ ప్రయాణం. మనిషిని పంపించి నాలుగైదు వర్క్‌షాపుల్లో అడిగిస్తే, యిప్పటికిప్పుడే మరమ్మత్తు చేయడం సాధ్యంకాదన్నారు. ఇక రైల్లో వెళ్ళిరావాలిసిందే ననుకున్నాను. నిన్న రాత్రి నేను కాస్త ఆలస్యంగా యింటికి వెళ్ళానులే! షెడ్డు ముందరి ఖాళీ జాగాలో కారు కనిపించింది. ఈ అబ్బాయి ఎవరో యింజను విప్పిపెట్టి దీక్షగా రిపేరు సాగిస్తున్నాడు. తనకు తెలిసిన వాళ్ళెవరి ద్వారా

నైనా మా ఆవిడ యితణ్ణి రప్పించి వుంటుందనుకున్నాను. భోజనాలయ్యాక తెలిసింది. తనకితణ్ణి గురించి ఏమీ తెలియదట. అతడొచ్చి షెడ్డు తాళాలడిగితే ఆమెగారు అతణ్ణి నేనే పంపించి వుంటాననుకుంది. మొత్తానికి భలే గమ్మత్తే జరిగిందిలే! అర్ధరాత్రికల్లా రిపేరు పూర్తిచేసి, అతడు కారును యింటి ముందరికి తోలుకొచ్చేశాడు. మళ్ళీ తీసుకెళ్ళి షెడ్డులో పెట్టి తాళంవేశాడు. తాళంచెవులు ముట్టజెప్పి పోవడానికివస్తే "ఎంతిమ్మంటావబ్బాయ్?" అని అడిగాను. అతడు నోరు మెదపకపోవడమే ఆశ్చర్యం! "ఫరవాలేదులే! ఎంతకావాలో అడుగు" అంటూ పర్సుచేతిలోకి తీసుకున్నాను. "డబ్బుకోసం కాదండీ" అన్నాడు. "మరేం కావాలి?" అన్నాను విస్తుపోతూ. 'అతడేమడిగాడో చెప్పగలవా చింతామణి'

చింతామణి మాట్లాడే స్థితిలో లేడు. అందువల్ల ప్రిన్సిపాలుగారే పూర్తిచేయవలసి వచ్చిందట.

"నా స్నేహితుడు. చింతామణి తమ కాలేజిలోనే చదువుకుంటున్నాడు సార్! వాళ్ళదేమీ కలిగిన కుటుంబంగాదు. కుర్రాడు బాగా చురుకైన వాడండీ! చదివించే వాళ్ళుంటే లోకంలో ఎన్ని చదువులున్నాయో అన్నీ చదువుకోగలడు. దయవుంచి తమరు, అదేదో స్కాలర్‌షిప్పుందట, దాన్ని వాడికిప్పించాలి."

◆ ◆ ◆

రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోయింది కాలం. ఐతే ఈ అయిదారేండ్ల కాలగమనం తర్వాత కూడా చదువుని గురించిగానీ, చింతామణిని గురించిగానీ నా మునుపటి అభిప్రాయాలను మార్చుకోవలసిన అగత్యం కలగలేదు. అదేనాకు సంతృప్తి!

వివరంగా చెబుతాను.

మొదట చింతామణిని గురించే! మోహన సుందరం గారిలాంటి డబ్బున్న ఆసామి పిలిచి పిల్లనిస్తానంటే మరొకరూ, మరొకరూ అయితే తటపటాయించే సందర్భమా? చింతామణి ఏమన్నాడు? "మా వూరు గుడిపాడు. అక్కడ నా తల్లిదండ్రులున్నారు" అన్నాడు. "హో, పేరెంట్స్! మంచిదే! ఉండవలసిందుండవలసిందే!" అన్నారట మోహన సుందరంగారు. "ఐతే ఒక జాబురాసి పడేస్తే పోలా! పిలిపించి మాట్లాడేద్దాం" అన్నారట కూడా! చింతామణి ఉత్తరాలు మామూలుగా నా చిరునామాకే వచ్చేవి. ఈసారి వ్రాసిన వ్యక్తి చింతామణి కాడుగనుక ఉత్తరం ధర్మయ్య పేరిటికి వెళ్ళింది. కవరైనా చించకుండా ధర్మయ్య్య నా దగ్గరికి పరుగెత్తుకొచ్చేశాడు. ఫ్రమ్ అడ్రస్సు చదివేసరికీ "అడ్వకేటూ.

అలాగంటే ఎవరండీ అయ్యగారూ!" అన్నాడు. అడ్వకేటంటే వకీలన్నాను. "వకీలా! అయితే నోటీసే అయివుంటుంది. వకీలు నోటీసందుకునేంతటి తప్పు పని ఏంచేశానండీ నేను?" అంటూ ప్రాణ పదార్థం లుంగలుచుట్టుకపోయినట్టుగా కృంగిపోయాడు. ఆ పాటికి ఆ జాబులోని సారాంశం నాకొక మాదిరిగా అవగాహన కావడంతో ఫక్కుమని నవ్వేశాను. "ఎంత పిచ్చిమాలోకానివయ్యా ధర్మయ్యా! ఇది వకీలు నోటీసు కాదయ్యా బాబు! వియ్యానికి మహజరు. లాయరు మోహన సుందరంగారు నిన్నొచ్చి అమ్మాయిని చూచుకోమని వ్రాశారు" అన్నారు.

అంతటితో ధర్మయ్యకేం మర్మమౌతుంది? మరింత విడమరిచి చెప్పవలసి వచ్చింది. మోహన సుందరంగారు పెద్ద లీడింగు లాయరే కావచ్చు. గొప్ప శ్రీమంతుడు కూడా కావచ్చు. కానీ అంతమాత్రాన ఆయన సైతం ఒక మానవ మాత్రుడుగాక పోలేదు. మామూలు లోకాచారం మేరకు ఆయనకూడా ఒక ఆడమనిషిని పెళ్ళాడి వుంటాడు. ఆమెద్వారా సంతానాన్ని పొందివుంటాడు. బిడ్డలెందరో మనకు తెలియదు. కానీ వాళ్ళల్లో ఈడొచ్చిన అమ్మాయి ఒకతే వుండడం మాత్రం తథ్యం. ఎంత లీడింగు లాయరైతే మటుకు, ఈడొచ్చిన అమ్మాయికి పెళ్ళిచేయకుండా వుండగలడా? తన అల్లుడికి కావలసిన విద్యావివేకాలు, గుణగణాలు ఆయనకు చింతామణిలో కనిపించి వుంటాయి. కుర్రవాణ్ణి కదిపి వుంటాడు. చింతామణి బుద్ధిమంతుడుగనుక "ఈ విషయాన్ని గురించి మీరు సంప్రదించవలసింది మా పెద్దవాళ్ళతోనండీ!" అని వినయంగానే మనవిచేసి వుంటాడు. ఆ తత్ఫలితమే ఈ లేఖ!

జీవితంలో ధర్మయ్యకంతటి ఆశ్చర్యమెప్పుడూ కలిగివుండదు.

"ఆయనెవరో పెద్ద వకీలంటున్నారు. మనదిక్కడ చూడబోతే లేమిడి కుటుంబం. ఆయనతో మనం సరితూగగలమంటారా" ఆ క్షణాన ధర్మయ్యా నాలుకపైన తడికూడా ఆరిపోయినట్టే తోచింది.

"సరితూగ గలవనే ఆయన భావిస్తున్నాడు. బీద అరుపులు అరవకుండా నీ పాటుకు నువ్వు వూరుకో కూడదా ధర్మయ్యా! శుభమా అంటూ పెళ్ళి ప్రస్తావన వస్తే సంకట పడిపోతా వెందుకూ!" – మందలించినట్టుగానే అన్నాను.

◆ ◆ ◆

ధర్మయ్య యింటికి వెళ్ళి మళ్ళీ అంతలో తిరిగివచ్చేశాడు. "పంతులుగారూ! గొప్పోళ్ళతో మాటలంటే సామాన్యమా? ఏం మాటాడాలో, ఎలా మాటాడాలో నాకేం తెలుస్తుంది? ఆ మంచి చెడ్డ లేవో మీరే చూచి పెట్టండి! ఇది మీకు తప్పేది గాదు..."

సరే నన్నాను. ఓ కుర్రాడి విద్యాభివృద్ధికి మూలకారకుడైన దోషానికి బడి పంతులకీ బాధ్యత అప్పగించబడవలసిందే! నా శిష్యుడి విషయంలో నేను నిర్వర్తించవలసిన చిట్టచివరి బాధ్యత మాత్రమే కాదు. చాలా ముఖ్యమైనది కూడా యిదే ననిపించింది!

ఆరోగ్యం బాగుండకపోవడంవల్ల తన తరపున వ్యవహరించటం కోసం ఫలానా వ్యక్తిని పంపుతున్నట్టు ధర్మయ్య వ్రాసినట్టుగా లాయరు మోహన సుందరంగారి కొక వుత్తరం వ్రాసి పోస్టు చెయ్యడంతో సంప్రదింపులకు పూర్వరంగం సిద్ధపరచబడింది.

క్రాపింగు దగ్గరినుంచీ నేను వేష సంస్కారం మొదలెట్టాను. ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని బట్టలు తోముకు రావలసిందని మడివేలుకు కబురుపంపాను. హస్త భూషణంగా ఒక లెదర్ బ్యాగు సంపాదించాను. క్రొత్తగా ఓ అంగవస్త్రం కొన్నాను. "ఓయమ్మో! నన్ను చూడ్డాని కొచ్చినప్పుడైనా ఇంతలావు ముస్తాబులేదే!" అంటూ మా ఆవిడ ఆశ్చర్యపడింది. ఆవిడకు వేపకాయంత వెర్రివుంది. లేకపోతే అలాంటి మాట అనేదేనా? తానేమో రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు రైటరు కూతురు. ఎలాంటివాడో ఒకడు మొగుడుగా దొరికితే చాలుననుకునే సంబంధం. తనను చూడ్డానికి వచ్చేవారు సైతం ఎంతటి పటాటోపంతో రావాలని ఈమెగారు ఎదురు చూచిందో ఏమిటో ఖర్మ!

స్టేషనులోనే చింతామణి నన్ను రిసీవు చేసుకున్నాడు. "నేరుగా టాక్సీలో వెళ్ళి దిగేద్దామా?" అన్నాను.

"ఎందుకూ! అంతా ఒక మైలు దూరం వుంటుందేమో! నడిచే వెళ్దాం" అన్నాడు. చింతామణి పట్ల నా చూపులు కాగడాలై అతడి ముఖంలో దేనికోసమో వెదుకుతున్నాయి. తలుచుకుంటే ఒక డజను టార్చీలు అవలీలగా కొనేయగల పెద్ద ఆసామికి కాబోయే అల్లుడి కుండవలసిన తెంపు ఈ ముఖంలో కన్పించదే!

స్టేషను నుంచీ ఈవలికకొచ్చేశాక మెల్లగా ఉపక్రమించాను.

"చూడు చింతామణి! నిజం. నాకొకందుకు ఆశ్చర్యంగా వుంది. నేను ధనవంతుల దగ్గర డబ్బు మాత్రమే వుంటుందనుకునేవాణ్ణి. వాళ్ళకు సదసద్వివేకం వుండదనుకుంటూ వచ్చాను. ఇందుకు లాయరు మోహన సుందరంగారు పెద్ద ఎక్సెప్షననుకో..."

"అలాగా! అంతటి బుద్ధిమంతుడంటారా ఆయన!" కాబోయే మామగారి గుణగణాలను ఎంక్వయిరీ చేసి తెలుసుకోవడంలో నికరమైన కుతూహలాన్నే వ్యక్తంచేశాడు చింతామణి.

"ఆమాత్రం ఊహించలేమంటావా చింతామణి! ఎన్నో కాలేజీలున్నాయి. ఎన్నో ఆఫీసులున్నాయి. చదువుకునే వాళ్ళయితేనేమి, ఉద్యోగం చేసేవాళ్ళయితేనేమి బోలెడుమంది

యువకులుంటారు. అందరిలోనూ ఏరికోరి నిన్నే ఎన్నికచేశారంటే, ఈ దృష్టాంతమొక్కటే చాలదా ఆయనెలాంటివాడో తెలుసుకోడానికి!"

ఎందుకో తెలియదు. అప్పటికి నేనేమిటో అసంగతంగా మాట్లాడినట్టు నావైపు అయోమయంగా చూచాడు చింతామణి.

"అసలేం జరిగిందంటే మేష్టరుగారూ, లాయరుగారున్నూ, మా ప్రిన్సిపాల్‌గారూ రోటరీక్లబ్బులో మెంబర్లట! ఎప్పుడో మాటల సందర్భంలో ప్రిన్సిపాల్‌గారు నన్ను గురించి చెప్పారు. లాయరుగారు నన్ను పిలిపించి మాట్లాడారు. అక్కరగా చదువుకునే వాళ్ళంటే తనకు చాలా యిష్టమన్నారు. అప్పుడప్పుడూ వచ్చిపోతుండమన్నారు. ఇదేం విడ్డూరంరా బాబూ అనుకున్నాను. ఆయన ఆంతర్యమేమిటో ససేమిరా బోధపడలేదనుకోండి..."

"వెళ్ళి ఖాదర్బాషాను అడగలేక పోయావా?"

రాతికి తగిలి మొక్కబోయిన మేకులా నా ఎత్తిపొడుపు వ్యర్థమైపోయింది. ఎంతో బుద్ధిగా సమాధనామిచ్చాడు చింతామణి.

అడక్కుండా వుంటానా? ఖాదర్బాషా టకీమని చెప్పేశాడు. "లాయర్లకు కక్షిదార్లంటే యిష్టముంటుంది. కేసులు తీసుకొచ్చే కోర్టు పక్షులన్నా యిష్టముంటుంది. డబ్బుమాట సరేసరి! దానికీ వాళ్ళకు చెప్పరానంత లంకె! కానీ అక్కరగా చదువుకునే వాళ్ళపైన వాళ్ళకు యిష్టముండాల్సిన అగత్యమేమీలేదు. వేరే కారణముంటుంది లెమ్మన్నాడు..."

"ఉండకూడదా? ఉండడం తప్పా? ఏమిటి చింతామణి వాడనేది?"

"తప్పనిగానీ ఒప్పనిగానీ వాడేం చెప్పలేదు. వేరే కారణముంటుందన్నాడు. ఆ మాట నిజమని తేలింది కూడా!"

"సదుద్దేశం కలిగి వున్నందుకు లాయరు గారిని పొగడవలసింది. ఈ ఖాదర్బాషా ఒకడు దొరికిపోయాడు నీకు!" "కూతురి కొక మొగుణ్ణి సంపాదించాలనుకోడం కూడా ఒక సదుద్దేశం క్రింద జమకట్టవలసిందే నంటారా?"

"ఈ మాత్రం మొగుళ్ళు ఆయన కింకెక్కడా దొరక్కపోయారా?" అందామనుకున్నాను. మరుక్షణం నా పొరబాటు నాకు తెలిసి వచ్చింది. ఆ మాటంటే చదువు ప్రాశస్త్యాన్ని నేను తీసిపారవేసినట్టువుతుంది.

మొత్తానికి కాబోయే మామగారి సంపదగానీ, హోదాగానీ ఈ నవ యువకుడిలో సంభ్రమం కలిగించడంలేదని తెలిసింది. అందువల్ల ప్రసంగాన్ని ప్రక్కదారికి పట్టించాలన్న నిర్ణయానికి వచ్చేశాను.

"మేము పల్లెలో ఉన్నాం. ఇక్కడ పట్టణంలో జరిగే సంగతులు మాకేం తెలుస్తాయి చింతామణి? అమ్మాయి నీకు నచ్చిందీ, లేనిదీ మాకు తెలియదనుకో! కానీ అమ్మాయి, అబ్బాయి ఒకరి కొకరు నచ్చిన తర్వాతగానీ లాయరుగారిలా చొరవ తీసుకుని జాబు వ్రాసి వుండరని మేమనుకున్నాం. అదృష్టం కలిసి రావడమంటే ఇదేనేమో! లేకపోతే లాయరు మోహన సుందరం అంతటివాడికి ఇలాంటి అభిప్రాయం కలగొచ్చునని మనమేమైనా కలగన్నామా... ఒకసారి ఏం జరిగిందంటే..."

ఏమీ జరగలేదు! పుల్లవిరుపు మాట లేవీ చెప్పడానికి వీల్లేకుండా చింతామణి నోరు మూయించడం కోసం యేదైనా ఊకదంపుడు ప్రసంగం కొనసాగించడం నాకప్పుడు అవశ్య కర్తవ్యంగా తోచింది.

"ఇదే లాయరుగారి యిల్లు" అంటూ చింతామణి నాకొక గొప్ప అందమైన కట్టడాన్ని చూపించగలడని నాకాది నుంచీ తెలుసు. నా ఊహ కపచారం జరగలేదనే యిక్కడ నేను చెప్పదలచుకున్నది. మోహన సుందరంగారు తన హుందాతనానికి తగ్గట్టుగానే మాకు అతిథి మర్యాదలు ఏర్పాటుచేసి వుండడం నాకెంతో ఆనందం కలిగించింది. మాకోసం వేచివున్న ఆసామి ఎదురుకోలుగా వచ్చి "రండి, రండి" అంటూ ఆహ్వానించి, గదుల మధ్యగా నడిపించి హాల్లోకి తీసుకెళ్ళి, మిద్దెమెట్లెక్కించి, అక్కడొక గదిలోని సుఖాసనాల్లో మమ్మల్ని సమావిష్టుల్ని చేశాడు. లాయరుగారు పనుల తొందరవల్ల సాధారణంగా అర్ధరాత్రి తర్వాతగానీ పడుకోరట! ఐనా కోర్టున్న రోజుల్లో మాత్రం తప్పని సరిగా ఉదయం అయిదింటికే లేచేస్తారట! ఆరోజు ఆదివారం గనుక కొంత ఆలస్యంగా నిద్రలేస్తారని తెలిసింది. "ఆలోగా మీరు స్నానం చేయదలచుకుంటే చేయండి. ఇది బాత్‌రూము. వేడి నీళ్ళకని, చన్నీళ్ళకని వేరువేరు కొళాయిలున్నాయి. అది సోపు. ఇది టవలు. మీరు స్నానంచేసేటప్పటికి టిఫినొచ్చేస్తుంది. ఇంకా ఏదైనా కావలిస్తే ఈ కాలింగు బెల్ నొక్కండి. నేను మీరొచ్చిన సంగతి లాయరుగారితో చెబుతాను" అంటూ ఆ ఆసామి క్రిందికి వెళ్ళిపోయాడు.

స్నానం చేసివచ్చి, తిరుగుతున్న ఫాను క్రింద కూర్చోగానే, మందాకినిలో స్నానమాడి నందనవనంలో సేదదీరుతున్నట్టుగా తోచడంతో నాకు కాస్త తన్మయత్వం కూడా కలిగింది. "నువ్వు స్నానం చేయవా చింతామణి!" అన్నాను.

"నాకు చన్నీళ్ళు పోసుకోడమే అలవాటు. ఈరోజు కూడా ఉదయం అయిదింటికే స్నానం చేసేశాను." – ఓ దళసరి కాగితాల పుస్తకంలో పుటలు త్రిప్పుతూ అన్నాడు చింతామణి.

"ఏం పుస్తకమదీ?"

"ఫోటో అల్బం లెండి!"

"ఏదీ లాయరుగారి ఫోటో వుందా అందులో?"

"ఉండవలసిన వన్నీ యిందులోనే వున్నాయి..."

ఆమాట నిజమే! అల్బం తెరిచేసరికి ఒక చిత్రకళా ప్రదర్శనంలో అడుగుపెట్టి నట్టయింది. చింతామణి చెప్పకపోయినా లాయరుగారెవరో యిట్టే కనిపెట్ట గలిగాను నల్లకోటును బట్టి. మిసమిసలాడుతూ బాగా వూరిన బంగాళా దుంపలా ఆయన పుష్టిగానే వున్నాడు.

ఇంకొక ఫోటోవైపు చూస్తూ "ఈమె లాయరుగారి పెద్దమ్మాయనుకుంటాను." అని నేనంటే చింతామణి నవ్వు మొగం పెట్టి "కాదండీ! ఈవిడే లాయరుగారి భార్య" అన్నాడు.

"నిత్య యౌవనాన్ని ప్రసాదించే మందులు పట్టణాల్లో వాళ్ళకేగానీ, పల్లెటూళ్ళ వాళ్ళకు దొరకవేమో" అన్నాను సగం స్వగతంగా, సగం ప్రకాశంగా.

"మందులుకావు. మేకప్పు సామానులనండి!"

"భలేవాడివేనోయ్ చింతామణి! అత్తగార్ని అల్లుడెగతాళిచేయడం సంప్రదాయమేలే! తప్పేమికాదు...' జ్ఞాపకం లేదుగానీ బిగ్గరగా నవ్వేవుంటాను.

"అప్పుడే యేమయింది? యింకా ఉన్నాయి ఫోటోలు చూడండి."

అందులో మగ జనాభాకంటే ఆడవాళ్ళ సంఖ్యే ఎక్కువ. వివిధ వయో రూపాలతో కన్నులకు విందు కలిగిస్తున్న ఆ స్త్రీ మూర్తుల్లో అక్కలెవరో, చెల్లెళ్లెవరో, ఎవరు ఎవరి బిడ్డలో అంతుపట్టడం లేదు. తనకైనా ఆ వివరాలు స్పష్టంగా తెలియవన్నాడు చింతామణి. యింకా నయం! పెళ్ళి కావలసివున్న అమ్మాయి ఎవరో తనకు తెలియదన్నాడు కాదు. మీదు మిక్కిలి ఆమె ఫోటో వచ్చినప్పుడల్లా "ఈవిడేనండీ" అంటూ నాకు హెచ్చరికలు చెబుతూ వచ్చాడు.

అంతవరకూ తామరాకుపైన నీటిబొట్టులా తత్తళించిపోతూ వచ్చి నా బుద్ధి ఆల్బంలో అమ్మాయి ఆకృతి కనిపించిన తర్వాత కదలడం మానేసింది. మోహన సుందరంగారు చింతామణిని తనకు అల్లుడుగా చేసుకోదలిచారని తెలియగానే నాకెందుకో ఈ అమ్మాయి ఏమంత అందంగా వుండకపోవచ్చునన్న అనుమానం కలిగింది. ఆల్బంలో అమ్మాయి రూపాన్ని చూచిన క్షణందాకా ఆ అనుమానం నన్ను వెంటాడుతూనే వుంది.

చింతామణి బెరుగు బెరుకుగా జంకుతూ గొంకుతూ, ఈ భవనంలో అడుగు పెట్టడానికి తనకేమీ అర్హత లేనట్టుగా ప్రవర్తిస్తూ వుండడానికి బహుశా యిదే కారణమై

వుంటుంది. సంఘంలో యింత స్టేటస్ వున్న పెద్దమనిషి, యింతటి అందగత్తె అయిన కూతుర్ని తనకిచ్చి పెళ్ళిచేస్తానని చెబుతే చింతామణిలాంటి వాడికి తీరా పెళ్ళి జరిగేదాకా ఆ మాట నమ్మడం కష్టమే!

అందేటంతవరకూ ఈ ద్రాక్షపళ్ళు పుల్లనివిగా భావించాలనీ, అథవా అలా భావిస్తున్నట్టుగా కనిపించాలని చింతామణి వుద్దేశమై వుండాలి.

క్రిందికి రావలసిందని పిలుపు వచ్చేసరికి ఎవరి ఆలోచనలు వారివిగా, మేము గురుశిష్యుల మిద్దరమూ మూగనోము పాటిస్తున్నాము.

దిగివచ్చేటప్పటికి హాల్లో ఒక సమావేశం ఏర్పాటయింది. లాయరుగారు సతీసమేతంగా సోఫాలో కూచున్నారు. సోఫాకు ఆవలా, ఈవలా ఆడమగా ఏడెనిమిది మంది దాకా కుర్చీల్లో కూచున్నారు. పెళ్ళి చూపుల కోసం మేము చూడబోయిన అమ్మాయి కూడా ఆ సమూహంలో కాన వచ్చింది.

“రమణయ్య గారంటే? మీరేనా నమస్కారం. కూచోండి' అన్నారు లాయరుగారు.

“శరీరంలో గాకపోయినా, ఆసనంలో సగం తావు ఆక్రమించింది గనుక ఈవిడెవరో ఈ పాటికి మీరు గ్రహించే వుంటారు. అందువల్ల ప్రత్యేకంగా పరిచయం చెయ్యను” అంటూ ఆయన కొనసాగించేసరికి ఒక్కపెట్టున నవ్వుల కోలాహలం చెలరేగింది.

సోఫాకు కుడివైపున అతికించినట్లుగా వేయబడిన రెండు కుర్చీల్లో పెద్దకూతురు. ఆమె భర్త కూచున్నారు. ఆయన భిలాయ్‌లో ఇంజనీరు. సంవత్సరానికొకసారి ఒక నెలరోజుల సెలవుల్లో ఆ భార్యభర్తలిక్కడికివచ్చి పోతుంటారు. కూతుళ్ళలో యిప్పుడక్కడ లేనిది రెండో అమ్మాయి ఒక్కతె మాత్రమే! ఆ రెండో అల్లుడుకూడా మామగారికి మల్లే ఒక అడ్వొకేటు. మూడో అల్లుడు బెంగుళూరులో ఏదో రిసెర్చి యిన్స్టిట్యూటులో ఉద్యోగి. ఆఫీసు పనిమీద అతడు ఢిల్లీ వెళ్ళడంవల్ల అమ్మాయి ఒంటరిగా పుట్టింటికి రావలసి వచ్చింది. నాలుగో అమ్మాయే విజయరాణి. ఆమె నందరూ యింట్లో “విజ్జి” అని పిలుస్తారు. విజ్జీ సైకిలు తొక్కుతుంది. ఈత కొడుతుంది, పాట, నాట్యం కూడా ఒక మాదిరిగా వచ్చు. “చాలా చురుకైన అమ్మాయి” అన్నారు మోహన సుందరంగారు. విజ్జీ కన్నా చిన్నవాళ్ళు కూడా యిద్దరున్నారు గానీ, వాళ్ళకిప్పుడిప్పుడే పెళ్ళిళ్ళు చేయవలసిన ప్రమేయం లేదన్నారు.

“నాకు కొడుకులు కూడా యిద్దరో ముగ్గురో వున్నట్టే జ్ఞాపకం! కానీ సిన్సియర్‌గా చెబుతున్నాను. వాళ్ళెక్కడుంటారో, ఏం చేస్తుంటారో తెలియదు!” అంటూ ముగించారు.

“బావగారిదంతా చోద్యంలెండి! ఆడ పిల్లల్లా తన చుట్టూ కొలువుతీర్చి వుండరని వాళ్ళపైన ఈయనకు కోపం!” ఈ మాటలన్నావిడ లాయరుగారి మరదలు. ఆమె లోకల్

హైస్కూల్లో హిస్టరీ అసిస్టెంటుగా పనిచేస్తూవుంది.

పరిచయాలన్నీ ముగిశాక చిన్న పార్టీలాంటి కార్యక్రమం ఒకటి జరిగింది.

మోహన సుందరంగారు ఆంతరంగిక చర్చల కోసమన్నట్టుగా నన్నొక్కణ్ణి మాత్రం ఆఫీసు గదిలోకి తీసుకెళ్ళి "అమ్మాయి మీకు నచ్చినట్టేనా?" అని ప్రశ్నించాడు.

"ఎంతమాటెంతమాట! నచ్చకపోవడమేమిటి?" అంటూ నొచ్చుకున్నాను.

"మరేమీ తొందర లేదు. బాగా ఆలోచించి వారం రోజుల్లో జాబు వ్రాయించండి. ఆడపిల్లలున్న వాళ్ళం గదా! వీలైనంత త్వరగా మా బాధ్యతను మేము నిర్వర్తించుకోవాలని ఉంటుంది. కట్నాలు, కానుకల విషయంలో సందేహం పెట్టుకోవద్దు. పెద్దమ్మాయిలకు ముగ్గురికీ జరిపినట్టే ఈమెకూ జరుపుతాను. అందుకేమీ ఢోకా వుండదు. అంతే సంగతులు..."

"అలాగలాగే! మీరామాట వేరే చెప్పాలా! వారం రోజుల్లో జాబు వ్రాయించడానికి కూడా ఆక్షేపణ వుండదు. కానీ ఆలోగా మీరొకసారి వచ్చి ఇల్లూ, వాకిలీ అదీ చూసుకుంటే బాగుంటుందేమో?"

"ఎందుకూ! అవసరం లేదు. అక్కడి స్థితి గతులన్నీ చింతామణి చెప్పాడు లెండి! అయ్యా, వాళ్ళు జీవిస్తున్నది పూరి కొట్టంలోనే కావచ్చు. అంతకన్నా హీనంగా వాళ్ళొక పందిరి క్రింద జీవిస్తున్నా నాకేమీ అభ్యంతరం వుండదు. నాకు కుర్రాడు ముఖ్యం. నేను అమ్మాయి నిస్తున్నది కుర్రాడికేగానీ పూరి కొట్టానికీ కాదు, పల్లెటూరికీ కాదు..."

"నూటికి విలువైనమాట సెలవిచ్చారు" అన్నాను.

"మాటలతో డబ్బు చేసుకునే వాళ్ళంగదండీ! అలా మాటాడ్డమే మా కలవాటు" అన్నారు మోహన సుందరంగారు.

ఆ రోజు మధ్యాహ్నం తాను వాడుకగా భోజనం చేసే మెస్సులోనే నాకూ భోజనం పెట్టించాడు చింతామణి. వచ్చిన పని జయప్రదంగా ముగిసిన సంతోషంలో ఒళ్ళు తెలియకుండా నిద్రపట్టింది. ఎండ బాగా చల్లబడిన తర్వాత నిద్రలేచాను. చింతామణి డ్రెస్ చేసుకుని ఎక్కడికో బయల్దేరడానికి ఉద్యుక్తుడై వున్నాడు.

ఎక్కడికి ప్రయాణమని నేనింకా అడగకముందే! "అలా ఖాదర్బాషా యింటిదాకా వెళ్ళివద్దామని" అంటూ తన ప్రతిపాదనను బయటపెట్టాడు.

"వాడికొక యిల్లుకూడానా!" - మనసులో అనుకోవలసిన మాట! నోరు జారింది.

నా మాటపైన వ్యాఖ్యానమేమి చెయ్యకుండా ఒక పొడి నవ్వు నవ్వాడు చింతామణి. "వాడిని మీ రెప్పుడు, ఏ మాత్రం అర్థంచేసుకున్నారు లెండి" - అన్నభావం ఆ నవ్వులో ద్యోతకమైనట్టు తోచింది.

"ఈ మధ్య వాడు పెళ్ళికూడా చేసుకున్నాడటగా! అదేమిటోయ్ చింతామణీ! "ఫ్రెష్"గా వాడికొక అమ్మాయి దొరక్కపోయిందా? మొగుడు చచ్చిన ముండను నిఖా చేసుకున్నాడటగా! అయ్యో. పాపం! వాడికేం కక్కుర్తి వచ్చిపడిందో చూశావా?"

ఈసారి పొడి నవ్వుకూడా లేదు. వట్టి మౌనమే వ్యాఖ్యానం.

సందుగొందుల వెంటబడి, మేమెంత దూరం నడిచిందీ లెక్కచెప్పడం కష్టం, రమారమి రెండు మైళ్ళ దూరం వుండొచ్చు. పట్టణం శివారులో ఇళ్ళంత సమర్థంగా లేనిచోట ఒంటరిగా ఒక చిన్న గారమిద్దె, తూర్పు పడమరలుగా యిల్లు, ఉత్తరపు దిక్కుకు అభిముఖంగా గుమ్మం, ఈవలా, ఆవలా రెండు గదులు, మధ్యలో హాలు. ముందరవైపు వసారా, మిద్దెకు పదిబారల దూరంలో మట్టి గోడలతో ఒక తాటాకుల పాక, మధ్యలో వున్న ఆరుబయట కొక ఆవరణ రూపం యిస్తూ చుట్టూరా కొబ్బరి పిలకలు, గంగరావి మొక్కలూ పెరుగుతున్నాయి. ఈ ఇంటి ఆభరణానికంతా కేంద్రంగా ఒక చేద బావి.

"ఖాదర్బాషా యింట్లో లేనట్టున్నాడు" అని "ఉండండి, ఫక్రుద్దీనున్నాడేమో చూస్తా" నని తాటాకుల పాకవైపు వెళ్ళాడు చింతామణి.

అయిదడుగుల ఎత్తయినా ద్వారంలో నుంచి వింటిదబ్బలా వంగిపోయి ఫక్రుద్దీను వెలుపలికి వచ్చాడు.

"దండాలండీ అయ్యగారూ! రాకరాక చాలా కాలాని కొచ్చేసేరు కూకోండి, కూకోండి" అంటూ కూచోడానికి అక్కడేమీ లేకపోవడం గమనించి "ఉండండి మంచం తీసుకొస్తాను" అంటూ మిద్దె లోపలికి వెళ్ళి నులక మంచం ఒకటి తీసుకొచ్చేశాడు.

సిమెంటుతో వేసిన నూతి చప్టాపైన మంచం వేస్తూ "కూర్చోండి. ఇక్కడైతే చల్లగా వుంటుంది' అన్నాడు.

"బాగున్నావా ఫక్రుద్దీనూ?" అంటూ పరామర్శించాను.

"మందేముందండీ అయ్యగారూ? అంతా అల్లా దేవుడి దయ!" అన్నాడు ఫక్రుద్దీను.

"ఒప్పుకోవల్సినమాటే! అల్లా దేవుడి దయ నీపైన ఏమాత్రం సోకిందనే నేనడగడం?"

"మా క్కావలసిందేముంది బాబూ! పూట గడవడ మెలాగన్న దిగులు లేకపోతే చాలు! ఏ పూట కాపూట నిబ్బరంగా మా గంజి మేము తాగుతున్నా మనుకోండి! నేనూ మా బీబీ బీడి మండిలో పన్జేస్తున్నామా రోజుకొక మూడ్రూపాయలు చేతికొస్తాయి. రెండోవాడు అసనుల్లా పాలడిపోలో పన్జేస్తున్నాడు. కాపురం కాస్త నిలద్రొక్కు కున్నాక వాడికొక బంకంగడి పెట్టించాలని వుంది. మూడోవాడు కాలేషా మిలిట్రి ఓటల్లో వుంటున్నాడు. ఏనాటికైనా వాడు టీ కొట్టు పెట్టుకోవల్సిన వాడే! పోతే పెళ్ళి కెదిగొచ్చిన

పిల్లొకతుంది గదా! దాన్ని కూడా కుట్టుపసంటూ ఒక వేపకంలో పడేశాడు వాళ్ళన్నయ్య. మేముండడం కోసం యిదిగో, ఈ పాకొకటి ఏసిచ్చాడు..."

"మునుపటి కొకడిలాగే "తల్లి కెత్తరా కోళ్ళ గంప" అన్నాట్ట! ఇక్కడికి తీసుకొచ్చి ముసలాళ్ళకు వేరుకాపురం ఏర్పాటు చేశాడన్నమాట! బాగుందిలే వరస!" – నిజంగా నాకు కాస్తాకోపం వచ్చేవుండాలి. లేకుంటే అలా రుస రుసలాడి వుండను.

బదులు చెప్పి వుండేవాడే ఫక్రుద్దీను. కానీ యింతలో గాజుల గలగల వినిపించినట్టై తెరవబోయిన నోరు మూసేశాడు. తలపైకెత్తి చూచేసరికి చెవిలో లోలక్కులు తళతళమన్నాయి. కాటుకకళ్ళు మిలమిల మన్నాయి.

"నా కోడలండీ అయ్యగారూ!"

పై పెచ్చు పరిచయమొకటి! (రెండు మూడేళ్ళ క్రితం యిలాగే యింకొక ముసలాడు ఈమెగారిని నా కోడలని వుంటాడు. సిగ్గులేకపోతే సరి!)

తగుదునమ్మా అంటూ తట్టలో మూడు గాజు గళాసులుంచుకుని తయారైపోయింది కోడలు. "నవ్వుకొందురుగాక నాకేటి సిగ్గు" అన్న పద్యం వచ్చివుంటే రాగయుక్తంగా పాడేదికూడానేమో!

తప్పుతుందా? తలరాత! పలకరించాను.

"ఏమిటమ్మా అది?"

"టీ పుచ్చుకోండయ్యగారు! మా సాయిబు చెప్పాడు మా మేష్టారుగారొస్తారు. రాగానే టీ కలిపి యివ్వమన్నాడండీ!"

"నేనిక్కడకి వస్తానని వాడికెలా తెలిసి వుంటుంది చింతామణి?"

"తీసుకొస్తానని నేనే చెప్పానులెండి!" అన్నాడు చింతామణి.

"గోడ కుర్చీ వేయించేవారట గదండీ మేష్టరుగారూ! ఏదీ ఓసారి కూచుని గోడకుర్చీ అంటే ఎలా వుంటుందో చూపమన్నానండీ! "ఛీ, పో, మా మేష్టరుగారు చెబుతేగాని కూచోనన్నాడండీ! ఈ పాటి కొచ్చేస్తుంటాడు గానీ. ఓ సారి గోడ కుర్చీ కూచోబెడితే చూడాలని వుందండీ!"

"మా రోషన్ యింతేనండి అయ్యగారూ, భలే చిలిపిదనుకోండి" మురిసిపోతున్నాడు ముసలి ముసల్మాను.

చల్లటి గాలిలో ప్రాణాలకెంతో వుల్లాసంగా వుండడంవల్ల కళ్ళు మూసుకుని ఏదో ఆలోచనలో పడ్డాను. అప్పటికే ప్రొద్దుపోయి, బాగా చీకటిపడింది. కొబ్బరి మొక్కను నాటినప్పటి నుంచీ గెలవేసేదాకా చేయవలసిన దోహద క్రియలను గురించి ఫక్రుద్దీను

చింతామణికి వివరించి చెబుతున్నాడు.

తనక్కడ లేని కొరతను పూరించడం కోసమన్నట్టుగా అంతలో రోషనా హృదయేశ్వరుడు సైకిలెక్కి రంయిమంటూ వచ్చి దిగేశాడు.

నమస్కారాలు, కుశల ప్రశ్నలు కాగానే హఠాత్తుగా ఏదో స్ఫురించినట్టు "అదేమిటే రోషన్?" అంటూ యింటివైపు దౌడుతీశాడు. "మేష్టరుగారిని వట్టి నులక మంచంపైన కూచోబెడతావా? పరుపు వెయ్యలేకపోయావా మొద్దుమొగమా!"

"మాట తడబడినట్టుందిలే! ముద్దమొగమా అనబోయి మొద్దు మొగమా అని ఉంటావు..."

మువ్వలు మ్రోగినట్టుగా నవ్వులు వినిపించాయి.

ఆ తరువాత కొంతసేపటికి తాటాకుల పాక దగ్గరినుంచీ మిత్రద్వయం మాట్లాడుకోవడం వినిపించింది. "పట్టణం ఎండలకు మేష్టరుగారు వడిలిపోయినట్టున్నారు. కాసేపు రెస్టు తీసుకోనీలే! మనం అలా బ్రిడ్జిదాకా వెళ్లి గాలి మేసొద్దామా చింతామణి" అంటున్నాడు ఖాదర్బాషా.

వాడిప్లాను నా కర్థమైపోయింది. పెళ్ళిచూపుల ఘట్టంలో తన ప్రమేయం లేకపోయినందుకు వీడికి తల కొట్టేసినట్టుంటుంది బహుశా. ఈ సంబంధంపట్ల తీసుకోబోయే నిర్ణయాలపైన తన ప్రభావం నెరపాలని వాడిప్పుడు భావిస్తూ వుండవచ్చు.

ఎందుకో తెలియదు. ఈ పెళ్ళి ప్రపోజలు వీగిపోయేటట్టుగా చేయాలన్న ప్రయత్నం ప్రారంభమైతే, అది ఖాదర్బాషా 'కార్నరు" నుంచే ప్రారంభం కావాలని నాకొక అనుమానం వుండనే వుంది. ఎందుకూ – అన్న ప్రశ్నకు నాకొక సహేతుకమైన సమాధానం స్ఫురించింది కూడా! రోదసీ నౌక తన ఆకర్షణ పరిధిని దాటిపోవడం భూమికిష్టం వుండదు గదా! చదువుల్నీ మాష్టరీ చేసిన వాడొకడు తనకు స్నేహితుడుగా వున్నాడని చెప్పుకోగలగడ మొక్కటే వాడిప్పటికి సంపాదించిన గౌరవం.

ఆ స్నేహితుడు మామూలు కొంపల్లో ఒక మామూలు నాసిరకం అమ్మాయిని చేసుకుంటేగాని ఈ స్నేహం నాలుగునాళ్ళు నిలవదు. అందుకని వాడు కాస్తో, కూస్తో శల్యసారథ్యం చేయకుండా వుంటాడా?

ఐనా ఫరవాలేదు. అసలు బిస నా చేతిలో వుంది.

"అయ్యగారూ! అన్నట్టడగడం మరిచిపోయాను. ఈ మధ్య మనూరి మునసబుకు జబ్బు చేసిందటగా! ఇప్పుడెలాగుందండీ?" అంటూ ఫకీరుద్దీను దగ్గరికి వచ్చి చప్టామీద కూచున్నాడు.

"చావబోయి ఎలాగో తేరుకున్నాడులే! ఆస్పత్రినుంచి డిశ్చార్జి అయివచ్చి యిప్పుడు పథ్యం పుచ్చుకుంటున్నాడు. నీకెవరు చెప్పారు?" అన్నాడు.

"మనూరి వాళ్లెవరో చెప్పారని భాషా అన్నాడు. ముసలీముతకా ఏమన్నానా? నా కళ్ళముందర పెరిగినోడు కదండీ! వాళ్ళమ్మగారి పుట్టిల్లు మల్లెలచెరువుకు ఆ రోజుల్లో సరైన రోడ్డయినా వుండేదికాదు. పుట్టింటికి బయల్దేరితే ఈ కుర్రాణ్ణి భుజాలపైన కూచోబెట్టుకుని ఆ యమ్మ వెనకాల మల్లెల చెరువు కెళ్లొచ్చేవాణ్ణి. "ఫక్రుద్దీను గుల్లం బాగ పలుగెలుతుంది" అనేవాడబ్బాయి."

అదొక్కటేగాదు, ఇంకా చాలా వివరాలు కావలసివచ్చాయి ఫక్రుద్దీనుకు నడిమింటి రాయప్ప కొడుకు కడుతూ వుండిన యింటి కట్టడం పూర్తయిందీ లేనిదీ, చంగల్రాజుగారు త్రవ్వించిన బావిలో నీళ్ళుపడిందీ లేనిదీ, నిరుడు జరిగిన పీర్ల పండుగలో మా వూరి పీర్లున్నూ బాణావరం పీర్లున్నూ బేటీ తగిలిందీ లేనిదీ యిలా ఒక్కొక్క వివరమే అడుగుతూ అతడు నా ఓపికను పరీక్షలో పెట్టేశాడు.

"ఆ వూరి నీళ్ళు నీకు చేదై పోయాయి. కాదు కూడదని యిలా పట్నవాసం వెలిగిస్తున్నావు. అక్కడ వాళ్ళు ఏమైపోతే నీకెందుకోయీ ఫక్రుద్దీనూ?" అంటూ ఒక దశలో తిరగబడకుండా వుండలేకపోయాను.

"పుట్టి పెరిగిన వూరు కదండీ! మమకారా లెక్కడికి పోతాయి" అన్నాడు ఫక్రుద్దీను పెద్ద వేదాంతిలా.

షికారు నుంచి తీరిగ్గా తిరిగొస్తూ స్నేహితులిద్దరూ ఓ ప్రతిపాదనను వెంట బెట్టుకొచ్చారు. మొదట కారణాలు ఏకరువు పెట్టారు. పట్టణంలో చీకటీగల బాధ చెప్పతరంగాదు. మురికి కాలవల దుర్గంధం ఒకటి. దబదబ బాదుతూ లారీలు పరుగిడుతుంటాయి. మీదుమిక్కిలి పరీక్షలు దగ్గర కొచ్చేస్తున్నాయి గనుక ఏ నాలుగైదు గంటలో తప్ప మిగిలిన రాత్రంతా చింతామణి చదువుకుంటూ వుంటాడు. దీపం వెలుగులో నిద్రెక్కడొస్తుంది? అందువల్ల నాకారాత్రికి ఖాదర్భాషా యింటి ఆవరణలోనే సుఖశయ్య ఏర్పాటు చేయడం మంచిది.

విధిలేక వాళ్ళ ఏకపక్ష నిర్ణయానికి నేనూ సమ్మతించాను.

మళ్ళీ ఉదయం కలుసుకుంటానని చెప్పి తీరా చింతామణి సెలవు తీసుకుని వెళ్ళిపోయాక, నేనప్పటికింకా భోజనంచేసి వుండలేదన్న విషయం గుర్తుకొచ్చింది.

కొంపదీసి నాకాపూట భోజనం ఏర్పాటు కూడా బాషా తన స్వగృహంలోనే చేశాడేమోనని నేను హడలిపోయాను. ఆ ప్రమాదం నుంచీ బయట పడడం నిజంగా ఆ పరమేశ్వరుడి చిద్విలాసంగానేనాకు తోచింది. "మహా రాణి"లో భోజనాలను గురించి,

సదుపాయాలను గురించి వినడమేగానీ చవిచూచింది లేదు. ఆ కొరత తీరింది. కలవాళ్ళ వెలగల భోజనాలెలావుంటాయో తెలుసుకోగలిగాను. హోటలు నుంచీ బయటకు రాగానే బాషా జంకుతూనే సినిమా ప్రోగ్రాం సజెస్టుచేశాడు. నాపట్ల తన కత్యంత భయభక్తులున్నాయని చెప్పకనే చెప్పడం కోసమన్నట్టుగా. వాడు నన్నొక తెనుగు సినిమాకే తీసుకెళ్ళాడు. పిక్చరు చాలా పసందుగానే ప్రారంభమైంది. అది సినిమాకదా! కాస్త ఆహ్లాదకరంగా వుండడమే దాని రివాజు. ఐనా నేను చూస్తూ వూరుకోవలసింది. త్రాగుడు జోలికి వెళ్ళకుండా కేవలం తిండివల్ల ఎంతటి మాక్జిమం మత్తును పొందడానికి వీలుంటుందో అంతా పొంది వుండడం వల్ల నైతేనేమి, ఇంద్రభవనం లాంటి థియేటరులో ఒళ్ళు అలా అలా గాలికి తేలిపోతూ వున్నట్టుండడంవల్ల నైతేనేమి నాకేదైనా చదరాలని అనిపించి వుంటుంది. శేషాద్రిగారు ఒక శ్రీమంతుడు. ఆయన భార్య ఇంద్రాణి ఒక సమాజ సేవకురాలు. ముగ్గురు కొడుకులతో, ముగ్గురు కూతుళ్ళతో వాళ్ళది నిండైన సంతాన సౌభాగ్యం. వంటలూ, వార్పులూ చేయడానికి, బజారు పన్లు చూడడానికి కార్లు నడపడానికి ఆ ఇంట్లో వేరే మనుషులున్నారు. కుటుంబ సభ్యులందరూ ఏ పండగకో, పబ్బానికో గానీ ఒకచోట కలుసుకోరు. ఎవరి వ్యక్తిగత జీవితం వాళ్ళది. ఎవరి స్నేహితులు వాళ్ళకున్నారు. సముద్ర తీరాల్లో తిరుగుతూ, స్విమ్మింగు పూల్స్‌లో ఈదుతూ, పార్కుల్లో విహరిస్తూ, విలాసయాత్రలు వెళ్తూ, ఎంతో ఖుషీగా జీవించేస్తున్నారు. పాత్రల పరిచయం పూర్తికాగానే "బ్రతుకంటే యిలా గుండాలిరా బాషా" అన్నాను. "కాసేపు వుండండి మేష్టరుగారూ! మెరుగుల్ని చూచి మేడిపండును మెచ్చుకుంటారా ఎక్కడైనా" అన్నాడు బాషా. ఒరుల సుఖసంతోషాలను చూచి ఓర్వలేకపోవడం కుళ్ళుమోతుల లక్షణం. ఎవడి కుళ్ళు బుద్ధి వాడికే శత్రువు. మళ్ళీ తెరపైన కథ పరుగిడుతోంది. శేషాద్రిగారి రెండో అబ్బాయి నిరంజనం పల్లెటూరి అమ్మాయి లక్ష్మిని ప్రేమిస్తాడు. చూడముచ్చటైన జంట. పొలాల్లో, కొండవాగుల్లో, అడవి కోనల్లో యుగళగీతాలు పాడుకుంటూ వాళ్లు యథేచ్ఛగా ప్రేమించుకుంటున్నారు. ఖాదర్బాషా వైపుకు వంగి "నిజమైన ప్రేమకు కలిమిలేములు ప్రతిబంధకంగా నిలవ్వురా బాషా! ఇక్కడ ఈ ప్రేమికుల సంగతి వదిలిపెట్టు! సలీం, అనార్కలీల మాటేమిటి? లైలా మజ్నూల మాటేమిటి?" అన్నాను. ఈ వాదం ముందు చిత్తు చిత్తయి పోవలసినవాడే బాషా అయినా ఏదో చెప్పబోయి, అంతలో ఎందుకు లెమ్మన్నట్టు వూరుకున్నాడు.

ఐతే జట్కాబండి బోల్తాపడ్డట్టుగా కారు చెట్టుకు గ్రుద్దుకున్నట్టుగా, విమానం నేలపైన కూలిపోయినట్టుగా ఆ సినిమా కథలో యింటర్వెల్ తర్వాత ఎక్కడలేని ఉత్పాతాలు ప్రారంభమయ్యాయి. పెళ్ళి చేసుకుంటానని వాగ్దానం చేసి నిరంజనం లక్ష్మిని పట్నానికి

తీసుకొచ్చాడు. ఇంటి పనులు గమనించే ఉద్యోగిగా లక్ష్మి శేషాద్రిగారింట్లో వుండవలసి వచ్చింది. అప్పట్లో అక్కడున్న మగవాళ్ళల్లో ఆమెను ప్రేమించనివాడు పాపాత్ముడు! ఇంతలో పులిమీదపుట్రలాగా అగ్ని బాధితుల సహాయంకోసం వసూలుచేసిన డబ్బుతో ఆ యింటి యిల్లాలు కొనుక్కున్న నెక్లెసు ఒకటి మటుమాయమౌతుంది. శేషాద్రిగారి మూడో అబ్బాయి 'సురేకారం' తన ప్రియురాలైన రీటా కోసం దాన్ని తస్కరించాడని ప్రేక్షకులకైతే తెలిసిందిగానీ, కథలోని ప్రధాన పాత్రలకు తెలియదు. ఆ దొంగతనం కాస్తా లక్ష్మిపైన పడుతుంది. వెనకా ముందూ చూడకుండా నిరంజనం గూడా ఆమెను యింట్లో నుంచి వెళ్ళిపొమ్మంటాడు.

ఒకానొక అమాయకురాలు అలా నిరాశ్రయురాలై పోయిన తర్వాత మేమంతా ఆ థియేటరులో కూచోవడంలో నాకేమీ అర్థం కనిపించలేదు. లేచి వెలుపలికి వచ్చేశాను. బాషా గూడా వెన్నంటి వచ్చేశాడు. "తలనొప్పిగా వుందిరా బాబూ! వెళ్ళిపోదామా?" అన్నాను. "డబ్బిచ్చి తలనొప్పిని కొనుక్కున్నట్టయింది. తెలిసి తెలిసి ఇలాంటి పాడు సినిమాకు తీసుకొస్తావట్రా నన్ను?" అంటూ కోపగించుకున్నాను. "అడవిమెకాల మధ్య తగులుకున్న కుందేలుగతేమౌతుందండీ మేష్టరుగారూ! ఇంతే అవుతుంది" అన్నాడు బాషా.

గేటు దాటుకున్నాము. అయిదు నిమిషాల వరకూ నిశ్శబ్దంగానే నడిచాము. ఇప్పుడు నాలుగైదడుగులు ముందుగానే వెళ్ళిపోతున్న బాషా హఠాత్తుగా ఆగిపోయాడు. అదొక హెచ్చరికలా ఒక మాటన్నాడు.

"ఈ సినిమా కథలో లక్ష్మికిన్నీ, ఇక్కడ మన చింతామణికిన్నీ నాకట్టే తేడా కనిపించడంలేదు."

అమ్మో, అమ్మో! నీ నిజస్వరూపం ఎంతసేపటికి బయటపడిందిరా బాబూ? అనుకున్నాను. అప్పటికి హోటలు భోజనం, సినిమా ప్రోగ్రాము, అందుకని ప్రత్యేకించి ఈ సినిమానే ఎన్నుకోవడం. యిదంతా ఒక ఎత్తుగడగా జరిగిన తతంగమన్నమాట! పండిన జొన్నచేలల్లో గువ్వలు వాలకుండా, ఒక దిష్టిబొమ్మను పెట్టడం కన్నా యిది తక్కువ పనికాదు!

అవకాశమిస్తే వీడు మేము నిర్ణయించిన పెళ్ళి సంబంధంపట్ల వెయ్యి అనుమానాలు రగిలించడానికైనా వెనుదీయడని తేలిపోయింది. ఆ అవకాశం బొత్తిగా లేకుండా చేస్తేగానీ వీడికి కూలు కుదరదు.

గురువింద గింజకు తనక్రింది నలుపు తెలియదట. తనలోని "నలుపు"ను ఎత్తిచూపించే వాళ్ళెవరూ లేరని గావచ్చు. వీడొకటే మిడిసిపాటు పడుతున్నాడు. నిర్భాగమాటంగా ఈ మేడి పండును వచ్చి చూపించడం నా చేత నౌను.

ఊరి శివార్లు దాటుకునేదాకా పట్టిన పది పదిహేను నిమిషాల్లో నేను నా కత్తిని బాగా నూరిపెట్టుకున్నాను. ఏకాంత ప్రదేశంలో కూచోడానికొక ఇసుక రాసి కనిపించేసరికి "కాసేపిక్కడ కూచుందామా బాషా!" అన్నాను.

కూచున్నాము.

"అలాగైతే నువ్వనే దేమిటి బాషా! చింతామణి ఆరేళ్ళపాటు ఇదే పట్టణంలో కనిపించాడు. ఎం.ఏ దాకా చదువుకున్నాడు, వాడు నోట్లో వేలు పెట్టినా కొరకలేని అమాయకుడంటే నేను నమ్మను. బాగేదో ఓగేదో మనకంటే వాడికే బాగా తెలిసి వుండాలని నా ఊహ. పెద్దరికం అంటగట్టినంత మాత్రాన వాడి జీవిత గమనంతో మనబోటివాళ్ళం మాటిమాటికీ జోక్యం పెట్టుకోవడం మంచిది కాదని నా ఉద్దేశం!"

ఖాదర్బాషా విలవిలలాడిపోవడం ఆ చీకటిలో నైనా నేను గమనించకపోలేదు. అప్పుడు నాకు దుష్టమృగాన్ని కటకటాల్లో పెట్టినంత ఆనందంగా వుంది.

"డబ్బును తీసుకెళ్ళి బ్యాంకులో వుంచేశామనుకో! ఇకదాన్ని గురించి మనకు నిశ్చింత! సరిగ్గా అలాగే యికమీదట చింతామణిని గురించి మనం ఆలోచనగానీ, ఆదుర్దాగానీ పెట్టుకోవలసిన అవసరం వుండదన్న నిర్ణయానికి వచ్చేశాను. నువ్వయినా ఈ నిర్ణయాని కెప్పుడో వచ్చేవుంటావు. అవునా బాషా?"

నా ప్రసంగంలో వాడి కర్థంగాని పదాలేవైనా వుండొచ్చు. కానీ నా అభిప్రాయం మాత్రం వాడికి విస్పష్టంగా అర్థమయ్యే వుండాలి. తిరగడం కూడా మానేసి, బోనులో తోక ముడుచుకుని కూర్చున్న జంతువులా వాడు తలవంచుకుని యిసుకలో పిచ్చి గీతలు గీస్తున్నాడు.

ఇందాక నేను నూరిపెట్టుకున్న కత్తిని ఝుళిపించడానికి అదే సరైన తరుణమని పించింది.

"చూడు బాషా! నీతో ఒక మాట చెప్పాలనుంది. ఎంత లేదన్నా నువ్వా కొన్నాళ్ళపాటు నాదగ్గర చదువుకున్న వాడివి. నా శిష్యుల్లో ఒకణ్ణి గురించి లోకంలో ఎవరైనా చెడుగా చెప్పుకుంటూ వుంటే నామట్టుకు నాకు తలకొట్టేసినట్టే వుంటుంది..."

షాక్ ట్రీట్‌మెంటు బాగానే పనిచేసింది. బాషా త్రుళ్ళిపడ్డాడు.

"నేనా! అలా ఏం నామర్దాపన్లు చేశానండీ?"

"అబ్బే నేను చెప్పడంగాదు. ఊరు పూరంతా కేవలంగా చెప్పుకుంటూ వుంటే ఎలా వినగలం చెప్పు. నీ పెళ్ళి విషయంలో నువ్వు కొంచెం తొందరపడ్డట్టే నాకూ తోచింది. కాలూ చేయీ బాగానే ఉన్నాయి గదా! ఎంతో కొంత సంపాదన గూడా

చేస్తున్నావు గదా! మరికొంత కాలం ఆగివుంటే నీకు తగిన సంబంధం దొరక్కపోయి వుండేదిగాదు."

"అంటే నేను మారు మనువు పిల్లను చేసుకున్నాననేగదండీ మేష్టరుగారూ!" నేను దిగాలుపడిపోయేట్టుగా పకాలున నవ్వేశాడు బాషా. "ఏ మొగాడైనా పెళ్ళి చేసుకున్నాక మాత్రమే పెళ్ళాం నడతకు పూచీగా వుండగలడు. పెళ్ళిగాక మునుపు ఏం జరిగిందో వీడికెక్కడ తెలిసింది? వీడి లాంటి మగమహారాజులు వెయ్యిమంది వుంటారు వూళ్ళలో ఏ కొందరి పైకో ఆమె మనసు వెళ్ళే వుంటుంది. మనసు పడితే ఫరవాలేదు. కాలు జారితేనేగదా కొంపమునిగేది అని మీరనొచ్చు అంత పనీ జరగలేదని మాత్రం గ్యారంటీ ఎక్కడుంది? ఎటొచ్చీ కళ్ళు మూసుకుని పాలు తాగితే తప్పులేదని మీరనుకుంటారు. కళ్ళు తెరుచుకుని తాగితే జరగరాని పని జరిగిపోయినట్టు గుండెలు బాదుకుంటారు. ఎందుకొచ్చిన లోకంలెండి మేష్టరుగారూ. తెలిసిన వాళ్ళు మీరే నాది తప్పంటే నేనింక చెప్పగలిగిందేముంది?"

ఈ ఖాదర్బాషా అనే వ్యక్తికి మంత్ర తంత్రాలేవీ చేతగావని నాకు నికరంగా తెలుసు. కానీ వాడి మాటలు విన్న తర్వాత నాకెందుకో వాకట్టు కట్టినట్టపోయింది. ఎంతో ప్రయత్నం మీదటగానీ ఆ భంగపాటునుంచి తేరుకోవడం సాధ్యం కాలేదు.

ఐనా అంబులపొదిలో ఒకటికి రెండు అస్త్రాలుంచుకునే నేను యుద్ధానికి ఉపక్రమించాను. ఒకటి వమ్మయిపోయింది గనుక యింకొకటి పైకి తీయక తప్పలేదు.

"వాళ్ళింకొక మాటగూడా అంటున్నారోయ్ బాషా! ఏదో త్రవ్వి తలకెత్తుతానని చెప్పి తల్లిదండ్రుల్ని యిక్కడికి తీసుకొచ్చేశావు. వాళ్ళుండటానికని వేరే గుడిసె ఒకటి వేసివ్వడం తప్పుగదూ. నీపంచలో వాళ్ళకింత చోటు దొరక్కపోయిందా చెప్పు..."

"నిజమేలెండి! మీరామాట అనావచ్చు. నేను వినావచ్చు. ఎందుకంటారా? మా అయ్యా, అమ్మా అక్కడ మారీల్లో వుండేవాళ్ళు. ఇక్కడికి తీసుకొచ్చి నేను వాళ్ళనొక గుడిసెలో పెట్టేశాను. ఇందుకు నన్ను మనూరివాళ్ళు గల్లుకు వేసినా వెయ్యొచ్చు!"

నా అస్త్రం ఎక్కడో తగలరాని చోటనే తగిలినట్టుంది. వాడి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరగడం నేను గమనించాను.

"ఒంట్లో సత్తువ వున్నంతవరకూ మనిషిచేత వూడిగం చేయించుకుంటారు. సత్తువ పోయింది. ఉడిగిపోయాడు. దయదలిచి ఊరికే దినబత్తెం ఇప్పిస్తుందేమిటండీ మీ గుడిపాడు? ఇవ్వదు. "ఫరవాలేదు. చింతచెట్టెక్కవోయీ సాయిబూ" అంటుంది. బావిలోకి దిగి పూడిక మన్నును పైకి తీయమంటుంది. నడుం వంగేదాకా ఎముకలు విరిగేదాకా

అడ్డచాకిరీ క్రింద మనిషిని గానుగాడేస్తుంది. నడుం వంగింది. ఎముకలు విరిగాయి. అప్పుడిక పస్తులతో అఘోరించి, అఘోరించి చంపుతుంది... ఆ గుడిపాడేనటండీ నాకు నీతులు చెప్పొచ్చేది?"

నేరకపోయి అవివేకంతో నేనీ ప్రసక్తి తెచ్చానేమోనని నాలో గాభరా ఒకటి బయల్దేరింది.

"తల్లిదండ్రుల్ని నా పంచలో వుంచుకోలే దంటారు. అప్పటికి నాకిక్కడేవో బంగళాలున్నట్టు. పన్నెండో యేటనుంచీ కూడబెట్టిన సొమ్ముతో ఓ ఖాళీ జాగా కొన్నాను జీతంలో నెలనెలా కొంత డబ్బు పట్టుకునే షరతుపైన వర్క్‌షాపు ఖామందు చిన్న యిల్లొకటి కట్టించి యిచ్చాడు. తోడబుట్టిన వాళ్ళతో కలిపి అయ్యనూ అమ్మనూ ఆ యింట్లోకి తోలిపెట్టి ఇంటి కోడలితో సరిపడక వాళ్ళు జుట్టూ జుట్లూ పట్టుకుంటే, చూడ్డానికా తమాషా లోకానికి బాగానే వుండేది. కుక్కల్లా కాట్లాడుకోవాలి. తోడేళ్ళలా ఒకరినొకరు పీక్కు తినాలి అంతేగానీ ఎవరిగంజి వాళ్ళు త్రాగుతూ, ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకుతూ, ఒకరికొకరు భారం కాకుండా అలగాజనం హాయిగా బ్రతకొచ్చా? తప్పా. తప్పున్నరా? మేము ముదనష్టప్పీనుగులంగా బ్రతకడంలేదు మనుషులంగా బ్రతికేస్తున్నామని గాకపోతే గుడిపాడు వాళ్ళ కెందుకండీ ఈ వుక్రోషం?"

ఖాదర్బాషాని గురించి క్షుణ్ణంగా తెలిసివున్న వాణ్ణి గాబట్టి సరిపోయింది. లేకుంటే "మీరు చదువుకున్న కాలేజీ ఏదండీ?" అని అడగవలసిన పరిస్థితి. ఎట్టి పరిస్థితిలోనైనా నా మనసు నాకు విధేయమై వుంటుందని నాకుండిన నమ్మకం ఆ క్షణంలో వదిలిపోయింది. కారణం అది నాపైన చేయసాగిన తిరుగుబాటు. లోతు తెలియకుండా నీటిలో దిగి, కడుపు బూరటిల్లి పోయేలా నీళ్ళుత్రాగి, ఊపిరి త్రిప్పుకోలేక విలవిల లాడిపోయేవాడి అవస్థ ఎలాంటిదో తెలియదు. అప్పుడు తెలిసి వచ్చింది.

మరునాటి ఉదయం మా వూరి ప్రక్కన రోడ్డులో బస్సు దిగేసరికి, ధర్మయ్యగారి అబ్బాయికి లాయరు మోహన సుందరం గారి అమ్మాయి నివ్వబోతున్నారన్న వార్త గాలిలో కలిసి అక్కడి ఆకాశంలో సుళ్ళు తిరుగుతోంది. ఏనాడూ లేనిది, గ్రామ మునసబు ధర్మయ్యను ఇంటికి పిలిపించి కాఫీ గీఫీ, నాష్టాగీష్టా యిప్పించి సత్కరించాడట; కావలిస్తే ఓ వెయ్యి రూపాయలు తీసుకెళ్ళి పెళ్ళి ఖర్చులకు వాడుకోమని కూడా అన్నాడట. ఇంటికి వెళ్ళగానే మా ఆవిడ చెప్పింది. "ఏ బస్సు కొచ్చారు? ప్రయాణం హాయిగా జరిగిందా? మంచినీళ్ళు పుచ్చుకుంటారా?" అంటూ మొదట పరామర్శించి, ఆ తరవాత యితర విశేషాలు ఏకరువు పెట్టాలన్న పరిజ్ఞానం పెళ్ళానికే లేకపోయింది. ఇక వూరివాళ్ళని

అనవలసిందేముంది? చొక్కాతీసి, వంకీకి తగిలించానేమో, పెరట్లోకి వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కుని యింటి లోపలికి వచ్చానేమో, తిరిగి చూచే సరికి ఒకరొకరుగా లోపలికొచ్చేస్తున్నారు. ఒక్కసారిగా యింతమంది పెద్దలు, పెత్తందారులు నాతో భేటికి రావడమంటే సామాన్యమా? నా హోదా కొన్నిరెట్లు పెరిగిపోయినట్లే వుంది.

చిట్టచివర వచ్చిన వాళ్ళు ధర్మయ్య దంపతులు. వాళ్ళ రాకతో పేరోలగానికి పరిపూర్ణత చేకూరినట్టయింది.

ఎటొచ్చీ పూసగుచ్చినట్లుగా నన్ను మాట్లాడనిచ్చి, సావధానంగా వినాలన్న ధ్యాస వాళ్ళలో నాకు కనిపించలేదు. చాలా ముఖ్యమైన స్టేటుమెంటు కోసం వేచివున్న పత్రికా విలేకరుల్లా వాళ్ళు నా పైకి దూసుకొచ్చేశారు.

"వెళ్ళిన పని ఏం చేసుకొచ్చారండీ పంతులుగారూ?"

"అయ్యగారు వెళ్ళడమూనూ, పవి రైటుగాక పోవడమూనా?"

"ముహూర్తాలు దగ్గర్లో వున్నాయి. పంచాంగాలు గూడా చూసే వుంటారు."

"అంతే మరి ! కల్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగుతుందా?"

ఈ మాత్రానికి వీళ్ల నాచుట్టూ మూగడం అవసరమే! ఎలాగో నేను తెరిపిచేసుకుని మోహన సుందరంగారి గృహవర్ణన ప్రారంభించేసరికి "ఇలా అన్నందుకండీ అయ్యగారూ, నేనూ ఫలానా వూళ్ళో ఒక యిల్లు చూచాను" అంటూ ఎవరికివారు వాళ్ళు చూచిన భవన రాజాలను గురించి చెప్పడం మొదలెట్టారు.

దొంగపైర్లలోకి వెళ్ళి పడుతుందేమో నని నోరు తెరవడానికి వీల్లేకుండా మూతికి ముకుజంభరం తగిలించిన గొడ్డులా నేను నిర్బంధ వాగ్బంధానికి గురిగాక తప్పింది గాదు. అంతరిక్ష నౌక దారితప్పినట్టు అనుమానంగా వున్నా, చేయిదాటి పోవడంవల్ల చేత ఉడిగి కూర్చున్న శాస్త్రజ్ఞుడిలా నేను నీళ్ళు నమిలాను. ఇంచుమించుగా ఎక్స్ పార్టీ నిర్ణయంలాంటిది చేసిపెట్టి ఊరి పెద్దలు వెళ్ళిపోయారు. నేను భోజనం చేశాను. పడుకున్నాను. రెండు మూడు రాత్రులు సరిగ్గా నిద్రలేదుగనుక గాఢంగా నిద్రపట్టి వుండవలిసింది. కునుకైనా కనికరించకపోవడంతో విసుగొచ్చింది. ఊరి బయటకు వెళ్ళి పోగొట్టుకున్న మతి కోసం వెదుకులాడుతున్నట్లుగా పొలాల గట్ల వెంట తిరగసాగాను. లాయరుగారి సంబంధం వల్ల చింతామణి కొకవేళ కీడంటూ జరిగితే ఆ కీడు తాలూకు స్వరూప స్వభావలెలా వుంటాయి, వివాహమైన తరవాత వాడికీ, కుటుంబానికీ మధ్య వున్న లంకె తెగిపోవచ్చు. తల్లిదండ్రులు కొడుకు పంచలో పట్టుమని పది రోజులు సుఖంగా గడిపే అవకాశం లభించకపోవచ్చు. ఇంతకు మించి ఏం జరుగుతుంది? అయ్యా, ఊహలయితే చేయవచ్చుగానీ అనాగతంలోకి చొచ్చుక వెళ్ళి జరగబోయేదిదే

అని నికార్సుగా చెప్పగలగడం ఎవడితరం? ఏమో, మేలు మాత్రం జరగకూడదా? ఇక్కడ నాకు పుస్తక జ్ఞానం బాగా సాయపడింది. నేను చదివిన ఒక్క కథలో ఒక తండ్రి తన కొడుక్కు "ఓరే అబ్బాయ్! జూద గృహాలకు వెళ్ళకు, వ్యభిచారం చెయ్యకు అంటూ నీతులు బోధిస్తాడు. ఆ కొడుకుది దుందుడుకు స్వభావమని నేను చెప్పను. కాస్త సాహసికుడని మాత్రమే అంటాను. వాడు జూదగృహాలకు వెళ్తాడు. అక్కడ అపారమైన లాభమొస్తుంది. ఒక వ్యభిచారిణితో సంబంధం పెట్టుకుంటాడు. ఆమె చనిపోతూ తన ఆస్తిపాస్తులన్నీ వాడిపేరిట వ్రాసి పెట్టిపోతుంది. అయినదానికీ, కానిదానికీ గిరిగీసుకుని కూచోకుండా, తెగువతో ముందుకు వెళ్ళేవాణ్ణేగదా లక్ష్మి వరించేది! అనవసరంగా గందర గోళపడి పోతున్నందుకు నా మట్టుకు నాకే నవ్వొచ్చింది !

తిరిగి తిరిగీ కాళ్ళు నొప్పెడుతున్నాయి. ఊళ్ళోకి తిరిగి వచ్చాను. కరెంటు రాకపోవడం వల్ల గుడిపాడులో పాత పల్లెటూరి వాలకాలింకా పాదుకునే వున్నాయి. ఇళ్ళలో దీపాలు లేకపోవడం వల్ల ఎనిమిది గంటల కల్లా అర్ధరాత్రి అయినట్టుంది. ధర్మయ్య యింటి ముందరికి వచ్చేసరికి పాదాలాగి పోయాయి. తలుపులు తట్టాను. 'రండీ, రండయ్యగారూ' అన్నాడు ధర్మయ్య. గుడ్డి దీపం క్రినీడలో నట్టింట వేసిన చాప మీద కూర్చున్నాను. వాస్తవిక దృక్పథంతో నేనిందాకా కీడును గురించి చేసిన ఊహల్లో ఒక్కొక్కటిగా బయట పెట్టాను.

అంతా విని ఫక్కున నవ్వేసింది ధర్మయ్య భార్య. "అయ్యగారూ! మా బిడ్డ ఎక్కడైనాసరే సుఖంగుండాలి! అంతే మాక్కావల్సింది. వాడి పెట్టుపోతలు మాకేం అక్కర్లేదు. మా రెక్కల కష్టముంది మేమున్నాము..."

అంతే, అంతే అంటూ అర్ధాంగి అభిప్రాయాన్ని బలపరిచాడు ధర్మయ్య.

సాగనంపుతూ ధర్మయ్య చెప్పిన మాటల ద్వారా అతడి ఆంతర్యం మరింతగా బయటపడింది.

"బాబూ! ఏదోవాడి అదురుష్టంవల్ల వాడికా చదువు వచ్చింది. మారాజులు పిలిచి పిల్ల నిస్తామంటున్నారు. ఇదీ వాడి అదురుష్టమే ననుకోవాలి. కానివ్వండి. ఎక్కడైనా సరే, వాడు లచ్చనంగా వుంటే నాకంతే చాలు."

ధర్మయ్య హెచ్చరిస్తూనే వున్నా ఇదిగో అదిగో అంటూ పదిరోజులు జాప్యం చేశాను.

ఐతే ఆమోదం అందేవరకూ వేచి వుండాలన్న పట్టింపు అవతలివాళ్ళకు లేకపోయింది. అభ్యంతరమేదైనా వుంటే మా దగ్గరి నుంచీ తప్పకుండా వుత్తరం వచ్చి వుండేదనీ. అలాంటిదేమీ లేదుగనక మౌనాన్ని అంగీకారంగా భావిస్తున్నామని ౼యురుగారు తెలిపారు.

"లగ్నం కుదిరింది. ఆ పాటికి చింతామణి పరీక్షలై పోతాయి. అచ్చువెయ్యగానే పత్రికలు పంపుతాను పెళ్ళికందరూ రావలసింది" అంటూ వర్తమానం వచ్చింది.

పెళ్ళి ఎలా జరిగిందో చెప్పాలి.

పెళ్ళి జరిగినచోటు మనోరంజనీ కళ్యాణ మండపం. అక్కడికొక మైలు దూరంలో వున్న పెద్ద హోటల్లో భోజనాల ఏర్పాటు. అసలింతకూ కన్యాదాత యిల్లెక్కడో మగ పెళ్ళివారికి తెలిసే ఆస్కారం లేకపోయింది. వాళ్ళపాలిట కిదంతా మాయాబజారు వ్యవహారంగానే తోచింది. పెళ్ళిలో పాల్గొంటున్న ఉత్సాహాన్ని ఆ ముఖాల్లో కాగడాపెట్టి వెతుక్కోవలసి వచ్చింది. జామీనుపైన విడుదలై మొదటిసారిగా కోర్టులో విచారణకు హాజరైన ముద్దాయిల్లా వాళ్ళు స్తంభాల చాటున, గోడలమాటున నక్కి వుండిపోయారు. సూత్రధారణ కాగానే హాల్లో కుర్చీలు ఖాళీ కాసాగాయి. సినిమాలో అవుట్‌పాస్ లిచ్చినట్టుగా కళ్యాణమండపంలో నుంచీ బయటికి వెళ్తున్నవారికి ఒక్కొక్కరికీ ఒక చీటి ముక్క ఎందుకిస్తున్నారో తరువాత తెలిసింది. అవన్నీ భోజనం చీటీలు. వాటిని చూపిస్తే హోటల్లో భోజనం పెడతారట! కాలినడకపైన హోటలుకు వెళ్ళి భోజనం చేసి వచ్చేసరికి కల్యాణమందిరం యించుమించు ఖాళీగా వుంది. కొంతసేపు విశ్రమించి లేచేసరికి వివాహ వేదికపైన కట్టిన పందిరిసైతం విప్పేశారు. అప్పుడిక నాకెదురైన సమస్య ఒకటే! దాదాపుగా రెండుపాతికల వరకూ వున్న బంధు బలగాన్ని లాయరుగారి ఇంటిపైకి తోలుకెళ్ళడం ఏం బాగుంటుంది? గుట్టు చప్పుడు గాకుండా తిరుగుదారి పట్టడమే సబబనిపించింది.

టిక్కెట్లు కొనుక్కున్నాము రైలొచ్చి స్టేషనులో ఆగింది. ఖాళీగా వున్న ఓ పెట్టెలో చోటు చూసుకున్నాము. పిల్లా, జల్లా తప్పితే బంధువుల్లో పెద్దవాళ్ళందరూ పెళ్ళికోసం పట్నానికి వచ్చి ఏదోఅమూల్యమైన వస్తువును ధారబోసుకుని వెళ్తున్నట్టు దిగులుగా వున్నారు. అప్పటికి వీళ్ళందరూ నన్నీ పెళ్ళి రథానికి ఒక సమర్థుడైన చోదకుడి క్రింద లెక్కగట్టారు. నొగను వదిలిపెట్టి పారిపోయి వచ్చిన సారథిలా నేనొక మూల ఒదిగి కూచున్నాను. అంతలో వున్నట్టుండి పెట్టెలో ఏదో సంచలనం బయల్దేరినట్టు తోచింది. కళ్ళుతెరిచి చూచేసరికి కిటికీ ప్రక్కన చింతామణి నిలబడి వున్నాడు.

"ఒళ్ళు తెలియకుండా పరుగెత్తి వచ్చాడేమో రొప్పుతూ రోజుతూ గసబోసుకుంటున్నాడు. చింతామణి ఉచ్ఛ్వాస నిశ్వాసాల ఒత్తిడివల్ల వాడి కళ్ళల్లో నీళ్ళు గూడా తిరుగుతున్నాయి."

"కల్యాణ మండపం దగ్గర అడిగాను మీరు స్టేషను కొచ్చినట్టు తెలిసింది. ఐనా యిదేం పనండి మేష్టారుగారూ నాతో ఒకమాటయినా చెప్పకుండా వచ్చేస్తారా మీరు?"

"ఫరవాలేదులే చింతామణి! పెళ్ళయిపోయిందిగా! ఇక యిక్కడుండి చేసేదేముంది?" అన్నాను.

"పట్నంలో పెళ్ళిగదా! మనకేం తెలుస్తుంది? ఇక్కడ పెళ్ళిళ్ళన్నీ యిలాగే జరుగుతాయేమో!" అంది ధర్మయ్య భార్య.

"పెళ్ళిలో ఏం తక్కువైందనీ! విస్తరి కయిదు రూపాయలకు తక్కువై వుండదు తెలుసా!" అన్నాడు ధర్మయ్య.

బండి బయల్దేరే గడువును సూచిస్తూ మొదటి గంట మ్రోగింది.

జేబులో నుంచి ఒక కవరు తీసి ధర్మయ్య చేతుల్లో వుంచాడు చింతామణి. "నేనైతే ఎంచలేదు. అయిదు వేలున్నట్లు కవరుపైన వ్రాసి ఉంది. నా చదువు కోసం నువ్వెంత అప్పు చేశావో నాకు తెలియదు. యెవరి సొమ్ము వాళ్ళకిచ్చేయి – కొంచెమో, నంచమో మిగిలితే ఇంటి ఖర్చుకు వాడుకో. ఈ పెళ్ళివల్ల మనం బావుకున్నదేదైనా వుంటే ప్రస్తుతానికిదే ననుకుందాం. సరేనా నాన్నా?"

స్వేచ్ఛగా తిరిగే సాధుజంతువును మృగ ప్రదర్శన శాలకు అప్పగించి ప్రతిఫలంగా ఏరూకో, అర్థగో తీసుకున్నట్టుగా ధర్మయ్య కన్నబిడ్డను పట్టణంలో దిగవిడిచి వచ్చేస్తున్నాడేమో ననిపించింది.

కుమారుడి సూచన మేరకు అప్పులు చెల్లించి ధర్మయ్య ఋణవిముక్తుడు కాగలడనే నేననుకున్నాను. అప్పుల వాళ్ళు గూడా ప్రోనోట్లు పైకితీసి, అసలు ఫాయిదాలు లెక్కచూచి ధర్మయ్య పిలుపు కోసం కాచుకుని కూర్చున్నారు. రోజులు గడిచినా వారాలు గడిచినా వాళ్ళకు పిలుపందనేలేదు. అందుకు బదులుగా ఊరికి పడమటగా వున్న చేనులో ధర్మయ్య యిటుకశూల కోయిస్తున్నాడని తెలిసింది.

వెళ్ళి చూచాను. మన్ను త్రవ్వేవాళ్ళు త్రవ్వుతున్నారు. మట్టి త్రొక్కే వాళ్ళు త్రొక్కుతున్నారు. రాళ్ళు కోసే వాళ్ళు కోస్తున్నారు. నాలుగు గుంటలకయ్యలో పచ్చి యిటుకలు బంతులు బంతులుగా పేర్చబడి వున్నాయి.

"మన కష్టాలెప్పుడూ వుండేవేనండీ అయ్యగారూ! కోడలొచ్చి కాలుమోపడాని కొకయిల్లు లేకపోవటం నామర్దా కదండీ! కొడుకూ కోడలు ఓ లోగిట్లో తిరుగుతుంటే చూడాలని వుండదా? వాళ్ళొచ్చేలోగా ఓ డాబా వేసెయ్యాలి – అప్పులకేముంది? నిదానంగా అచ్చుకోవచ్చు..."

చాలనిదానికి యింకా రెండువేలో, మూడువేలో ఋణంచేసి ధర్మయ్య యింటి పని పూర్తిచేశాడు.

కొడుకూ, కోడలు రావలసి వుండడమే తరువాయి.

జాబు వ్రాయించాడు. కేరాఫ్ మోహన సుందరంగారి చిరునామాకు ఉత్తరం వెళ్ళింది.

అనుక్షణం నిరీక్షణ. వృద్ధ దంపతులు కళ్ళల్లో వెలిగించి పెట్టుకున్న ఆశాదీపాలు చింతామణి భార్యను తీసుకొస్తాడా? తీసుకరాగలిగాడా? లాయరుగారు పంపిస్తారా? మొదలైన ప్రశ్నలకన్నింటికీ రోజుల మీదట లభించిన సమాధానం - చిరునామాదారు ఆచూకీ తెలియడం లేదన్న రిమార్కుతో తిరిగి వచ్చిన ఉత్తరం!

"ఇదేమిటండీ అయ్యగారూ! పెళ్ళయి యిది మూడో నెలే గదండీ కావస్తోంది! అత్తగారింట్లో లేకుండా వీడేమైనట్టు? ఒకవేళ ఎక్కడకైనా వెళ్ళదలిస్తే, ఆ మాట కాస్తా చెప్పి వెళ్ళొచ్చుగదా! అయినా ఈ కాలపు కుర్రాళ్ళు బొత్తిగా జవాబ్దారీ లేని వాళ్ళయిపోయారు లెండి!" అంటూ విలవిలలాడి పోయాడు ధర్మయ్య.

వెళ్ళినవాడు అంతలో తిరిగొచ్చి 'పోనీ, కుర్రాడెక్కడికో వెళ్ళాడనుకుందాం. మామగారా విషయం మనకు తెలియపరచాలి. అదేం న్యాయం. అంతలావు వకీలుకు ఈ మాత్రం తెలీకపోడ మేమిటండీ ఖర్మగాకపోతే!' అంటూ వాపోయాడు.

తల్లి పరిగెత్తుకొచ్చింది. "బాబ్బాబూ! మీరెళ్ళి విషయమేమిటో తెలుసుకుని రావాలి. బిడ్డ ఎక్కడున్నాడో తెలిసేదాకా మనసు మనసులో వుండదు" అంటూ గింజుకుంది.

"మీరూరుకోండి! వాడి ఆచూకీ తెలుసుకునే పూచి నాది. కనీసం ఖాదర్బాషాకైనా వాడెక్కడికి వెళ్ళాడో తెలిసి వుంటుంది. వాడికి రాస్తే టంచనుగా బదులొస్తుంది కూడా!" అంటూ సముదాయించాను.

ఆశించిన మేరకు ఖాదర్బాషా దగ్గర్నుంచి ప్రత్యుత్తరం వచ్చింది. ఐతే ఆందోళనను ఉపశమింప జేసే వర్తమానమేదీ అందులో లేదు. కాగా పోగా చింతామణి అంతర్ధానాన్ని ఖాదర్బాషా వూహించిన ఉత్తరం ఒక 'మిష్టరీ' స్థాయికి తీసుకెళ్ళింది.

"ఓ రోజు సాయంకాలం చింతామణి మా యింటి దగ్గిరి కొచ్చాడు. మౌనంగా కూచున్నాడు. చీకటి పడింది భోజనానికుండి పోతాడని తెలిసివుంటే అందుకేదైనా ఏర్పాటుచేసి వుండేవాణ్ణి. మనిషిలో వెళ్ళిపోయే ధ్యాస కనిపించింది కాదు. భోజనం చేయమంటే ఆకలిగా లేదన్నాడు. బలవంతంచేసిన మీదట పిడికెడు మెతుకులతో తిన్న శాస్త్రం ముగించాడు. ఆ రోజు రాత్రి వాడు సరిగ్గా నిద్రపోయి వుండడనే నా అనుమానం. భళ్ళున తెల్లవారకముందే నన్ను నిద్రలేపాడు. వెళ్ళొస్తా నన్నాడు. 'నా దగ్గర గూడా దాపరికమేనట్రా? విషయమేమిటో చెప్పరాదూ' అన్నాను. 'ఉంటే ఓ పాతిక రూపాయలు కావాలి. మళ్ళీ యిచ్చేస్తాను' అన్నాడు. ఇంటిలోపలికి వెళ్ళి డబ్బు తీసుకొచ్చాను. ఆ

రోజు వెళ్ళడమే వెళ్ళడం! నేనింకా వాడు మన వూరికేమైనా వచ్చాడేమోనని అనుకుంటూ వున్నాను...”

చింతామణి అజ్ఞాతవాసాన్ని గురించి ఎవరికి వారు తమకు తోచిన ఊహాగానాలు చేయసాగారు. నిజానికి చేరువగా వున్న ఊహ ఏదో చింతామణి అజ్ఞాతవాసం నుంచి బయటపడిన తర్వాతగానీ తెలియదు. అంతవరకూ ఓపిక వహించే నిబ్బరం తల్లిదండ్రులకు లేకపోయింది. లేని తెగువతెచ్చుకొని ధర్మయ్య పట్నం వెళ్ళొచ్చాడు. లాస్టు బస్సులో దిగాడేమో. అప్పటికి వూరంతా మాటుమణిగింది. వసారాలో పడుకుని అప్పటికప్పుడే నిద్రలోకి జారుకుంటున్న నాకు వున్నట్టుండి మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూచేసరికి చీకట్లో కలిసిపోయి, నడుము వంగిపోయిన కంగారు జంతువులా మోకాళ్ళమీద చేతులానించుకుని కూర్చుని వున్నాడు ధర్మయ్య.

“పొరబాటు జరిగిపోయింది గదండి అయ్యగారూ! తెలియకపోయి వూబిలో దిగేశాం. ఒకర్నని ఏం లాభం? మా బుద్ధే గడ్డి తినింది. బంగారంలాంటి బిడ్డ గదండీ! వాణ్ణి గురించే నా ఏడుపు...”

“ఏం జరిగింది ధర్మయ్యా?” అంటూ లేచికూర్చున్నాను.

“ఏదైనా జరిగివున్నా బాగుండిపోయేది. వెళ్ళి తాళ్వారంలో వేసివున్న బెంచీపైన కూర్చున్నాను. వచ్చేవాళ్ళు వస్తున్నారు, వెళ్ళేవాళ్ళు వెళ్తున్నారు. నన్ను గమనించిన నాధుడే లేడు. నలుగురైదుగురు పడుచువాళ్ళు ఒక గుంపులా బయటికొచ్చారు. అందరూ కలిసి ఓ కారులో కూచుని చక్కా ఎక్కడికో వెళ్ళిపోయారు. వాళ్ళల్లో కోడలుపిల్ల కూడా వున్నట్టే గుర్తు. పెళ్ళి పందిరిలో ఏం చూచానో ఏమిటో ఆపిల్ల సరిగ్గా, యిలా వుంటుందన్న అంచనాయే లేదు నాకు! ఆడ పిల్లలు పొడుగాటి షరాయిలు తొడుక్కున్నారు; అవి చొక్కాలూ కావు. బనీనూ కావు, అలాంటి అంగీలు తొడుక్కున్నారు. అప్పటికీ వాళ్ళేనయం. ఆ కుర్రాళ్ళ సంగతేమిటంటారు? గడ్డాలా, మీసాలా; జాకెట్టు బట్టతో చొక్కాలా? రామరామ ఆ వేషాలు చూడ్డానికి దేవుడిచ్చిన రెండు కళ్ళెక్కడ సరిపోయేటట్టు?...”

“సర్లే! ఇంతకూ చింతామణి సంగతేమైనా తెలిసినట్టా, లేనట్టా?” అన్నాను చిరాకుతో.

“ఒక జాము నేనలా కూచుండిపోయాక వకీలుగారి దర్శనం దొరికింది. చూడగానే ఆయన నన్ను పోల్చుకోడముంది చూచారా! అది నేనడిగొచ్చిన పుణ్యం. లేచి దగ్గరకు వెళ్ళాను. “ఓ” గుడిపాడు కదూ!” అన్నారు. అవునని చెప్పేలోగానే అర్జంటు పనులున్నాయి,

తొందరగా వెళ్తున్నాను. ఏదైనా మాట్లాడవలసి వుంటే యింట్లో ఆడవాళ్ళున్నారు" అంటూ ఆయన తుర్రున జారుకున్నాడు. నేనొచ్చినట్లు, అక్కడ కాచుకుని వున్నట్టు అమ్మగారికి తెలియాలిగదా! ఓ పనిమనిషి కనిపిస్తే చెప్పి పంపుకున్నాను. అరగంట సేపటికి నిక్కుతూ, నీలుగుతూ వచ్చి అమ్మగారు వాకిట్లోనుంచీ నావైపు తొంగి చూచింది. ఎప్పుడొచ్చారని అడిగింది. ఇప్పుడే వచ్చానన్నాను. అందరూ బాగున్నారా అని ఆవిడ అడగలేదు. నేనే అడిగాను ఆవిడ తలాడించింది. కోడలు బాగుందా అన్నాను. 'ఇందాకా యిలా వెళ్ళిందే! మీరు చూడలేదా?' అంది. అప్పుడిక చింతామణి మాటెత్తాను. 'మీ వూళ్లో లేరా?' అంటూ తెల్లబోయింది. 'ఏమిటోనండీ! చెప్పకుండా, చెయ్యకుండా వెళ్ళిపోతే మేమేమనుకోవాలి? చిన్నవాడు చితకవాడు అయితే కనిపించుటలేదు అని పత్రికల్లో ప్రకటనైనా చెయొచ్చు. వస్తాడు లెండి ఎక్కడికో వెళ్తాడు! అయ్యోపాపం, మీరిందు కోసం పడుతూ, లేస్తూ వచ్చారల్లేవుంది. కాసేపుండి భోజనంచేసే వెళ్ళండి!' అంటూ ఆవిడ నా మర్యాద నాకు చెల్లించింది. అంత చల్లటి మాట చెవిలో పడ్డాక నాబ్రతుక్కింక భోజనం గూడానా! అమ్మగారలా లోపలికి వెళ్ళగానే నేను బయటికొచ్చేశాను..."

తాగవలసినంత పిరికి మందే తాగి వున్నాడు ధర్మయ్య. అప్పట్లో ధైర్యాన్ని నూరిపోసే హితోపదేశమే అతడికి తగినైన ఔషధమనిపించింది.

"నిజానికి దేమంత బెంగ పెట్టుకోవలసిన విషయం కాదులేవోయ్ ధర్మయ్యా! వాడేం చదువుకోనివాడా? సంస్కృతంలో ఓ సామెత వుంది. అదేమిటంటే - ధనవంతుడున్నాడనుకో, వాడు స్వగ్రామంలో మాత్రమే గౌరవింపబడతాడట; విద్యావంతుడి సంగతలా కాదు. ప్రపంచంలో యెక్కడైనా వాడికి గౌరవ స్థానం వుంటుంది. చింతామణి కేమయ్యా! వాడేదో కార్యార్థంగానే వెళ్ళి వుంటాడు. నిక్షేపంగా తిరిగొచ్చేస్తాడు. నువ్వింటికి వెళ్ళి నిశ్చింతగా నిద్రపో."

**లా**యరు మోహన సుందరంగారి ధర్మపత్నిది ఎలాగైనా సిద్ధవాక్కని తెలుసుకోడానికి ఆరుమాసాల కాలం పట్టింది. అందరి ఓపికలు ఆపాటికి హరించిపోయాయి. చింతామణి ఆచూకీ తెలుసుకోడానికి చేయతగ్గ చివరి ప్రయత్నంగా, యిష్టమున్నా లేకపోయినా పత్రికలకు ప్రకటన పంపుకోవలసి వచ్చింది.

"ప్రియమైన చింతామణి! నువ్విలా చేస్తావని కలలోనైనా అనుకోలేదు. నిన్ను గురించిన బెంగతో మీ అమ్మా, నాన్నా చిక్కి శల్యమైపోయి వున్నారు. వాళ్ళకు వూరట

కలిగించడం నీ కర్తవ్యం. నీ క్షేమ సమాచారాలు తెలిస్తేగానీ వాళ్ళకది లభించదు. తక్షణం నువ్వు బయల్దేరి రావాలి. వీల్లేకపోతే, కనీసం జాబు వ్రాసినా సరే గ్రుడ్డిలో మెల్ల. ఇట్లు – రమణయ్య."

ఓ గులకరాయిని చెరువు నీటిలో విసరివేస్తాం. అది బుడుంగున మునిగిపోతుంది. బుడగలు పైకొస్తాయి. తరువాత క్రమ క్రమంగా అలలు పుట్టుకొస్తాయి. పత్రికల్లో పడిన ప్రకటనకున్న ప్రభావం కూడా అలాంటిదే! వేచి చూడాలి.

టపా సంచీ భుజాన వేసుకుని వూళ్ళోకి వెళ్తున్న పోస్ట్‌మాన్‌ను చూచినప్పుడల్లా "భగవంతుడా! ఇందులో ఒక చల్లటి కబురుండ కూడదా?" అనుకునే వాణ్ని.

ఈ నిరీక్షణలో మళ్ళీ పది, పదిహేను రోజులు గడిచిపోయాయి.

నూనె పూర్తిగా ఆవిరైపోయి, ఆశాదీపంలో ఒత్తే మండుకుపోతున్న తరుణంలో వచ్చాడు పోస్టుమేన్ "మేష్టరు గారూ! మీకొక వుత్తరం" అంటూ.

కవరుపైన దస్తూరీ చూచాను. గుండెలు కుదుటపడ్డాయి. చింతామణి సజీవత్వాని కొచ్చిన సేగి లేదు.

కవరు బరువుగా వుంది. కంపిస్తూన్న చేతులతోనే విప్పాను.

అసిస్టెంటుతో క్లాసు చూచుకోమని చెప్పి, బడితోటలోకి వెళ్ళి చెట్టుక్రింద కూర్చున్నాను.

వ్రాసిన తేదీగానీ, వ్రాయబడిన చోటు గానీ లేకుండా వట్టి సంబోధనతో ప్రారంభమైంది వుత్తరం. వెంటనే ఓ సంజాయిషీ గూడా!

"మేష్టరుగారికి నమస్కారాలు.

నా పాలిటికి రేయింబవళ్ళు, ఉదయం, సాయంకాలం, నడిరాత్రులు, మిట్ట మధ్యాహ్నాలు, వసంతాల, వడగాల్పులూ అన్నీ ఒక్కలాగే వున్నాయి. కాలం ఘనీభవించి పోయినట్టుగా ఒక భ్రమయిపోగా ఊరి పేరయినా వ్రాయక పోవడం మీకు విడ్డూరంగా తోచవచ్చు. ఎందుకు వ్రాయాలో బోధపడడం లేదు. నేనీ ఊరికి వచ్చి నెల రోజులయింది. ఉదర పోషణకిక్కడొక మార్గం దొరకడం వల్లనే ననుకుంటాను ఈ ఊరంటే నాకాదిలో కాస్త గౌరవం ఉండేది. కాని నెలరోజులుగా నా చుట్టూరా నెలకొని వున్న నికృష్ట పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడా గౌరవ భావం లుప్తమైపోయింది. ఆ మాటకొస్తే నాకిప్పుడీ ఊళ్ళపైన, ఈ మనుషులపైన, వీళ్ళ వ్యవస్థల దేనిపైనగానీ గౌరవం లేదు.

ఒక గుండెలో చెలరేగే అలజడివల్ల మానవ జాతికి ఆపద కలగదు. వ్యక్తి మాత్రుడు ప్రతిపాదించే విశ్వాసరాహిత్య తీర్మానంవల్ల సమాజం తల్లక్రిందులైపోదు. కానీ దెబ్బ తగిలినప్పుడు ఏడవడం ప్రాణులకు సహజం. మేష్టరుగారూ! నేనిప్పుడు చేస్తున్నపని అదే!

కబురు విడిచిపెట్టకుండా, జాబు వ్రాసి పోస్టుచెయ్యకుండా నేనిలా హఠాత్తుగా కనుమరుగై పోయివచ్చినందుకు మీరు కోప్పడి వుంటారు కానీ నా కోపం సంగతి నేనెవరితో చెప్పుకోను? నా కోపానికి అర్థంలేదని మీరనుకున్నా సరే! మీ అభిప్రాయంతో నాకు సంబంధంలేదు. నా కోపం ముఖ్యంగా కేంద్రీకృతమై వుండడం మీపైన! మీరొక్కరే గనుక లేకుంటె నా జీవితంలో పది పన్నెండేళ్ళ బంగారు కాలం నాలుగు గోడల తరగతి గదుల మధ్య వృధా అయిపోయి వుండేదిగాదు. మా నాన్నగారి తరిబీదు క్రింద నేను మేడిపట్టి, కాడిగట్టి, కబిల తోలి నా పొలాలు నేను దున్నుకునే వృత్తిలో ఆరితేరి వుందును. నా చదువు పైన పెట్టిన డబ్బుతో మా నాన్న ఒక బావి, ఒక నీటిపంపు ఒక తోట లేదా కొత్తగా రెండెకరాల పొలం ఏర్పాటు చేసుకోగలిగి వుందును. గడిచిన ఏడెనిమిది మాసాలుగా నా మనసు కెదురైన చిత్రహింసవల్ల నేను పొందిన బాధ తక్కువ? నా ఆరాటం ఒక్కటే! ఏం చేశారని నా తల్లిదండ్రులకీ శిక్ష? ముసలితనంలో కృష్ణా రామా అనుకుంటూ నిర్విచారంగా కాలం గడపవలసింది పోయి, ఒక వైపు సేద్యం పనులతో సతమతమౌతూ, యింకొక వైపు అయిపులేకుండా మటుమాయమైపోయిన నాకోసం కుమిలిపోవలసిన దురవస్థ వాళ్ళకెందుకొచ్చింది? మేష్టరుగారూ! మీరు సర్వం తెలిసినవారు. మీరే సమాధానం చెప్పాలి.

మీరనుకుంటారు – చదువులనిచ్చెన పైన వీణ్ణి పై మెట్టుదాకా తీసుకెళ్ళిన ఘనత మనదేకదా అని. నిజమే. నేనూ ఒప్పుకుంటాను. కానీ చదువుల రూపంలో మండూకాన్నై వున్నంతవరకూ వాస్తవిక ప్రపంచాన్ని గురించి ఓనమాలైనా తెలుసుకోక పోయినందుకు నాకు సిగ్గుగావుంది. ఆ నుయ్యిలో నుంచి బయటపడ్డాకనే, పుటలు పుటలుగా విప్పి లోకాన్ని చదువుకో గలిగాను. విశ్వ విద్యాలయాల్లో ఏముంది? తనను నమ్ముకున్న యువకుణ్ణి, భావిపౌరుణ్ణి ఒక ఉద్యోగిగా, ఆ ఉద్యోగం దొరకడం నూటికి తొంభైతొమ్మిది పాళ్ళు గగనకుసుమమే గనుక ఆఖరుకొక అప్రయోజకుణ్ణిగా, నిస్సహాయుణ్ణిగా తీర్చిదిద్దే "చదువు" మాత్రమే వుంది. ఆ చదువే నాకబ్బింది! ఆ చదువుల మధువునే నేను దోసిళ్ళకొద్దికీ త్రాగింది!

ఐతే ఒకటి. కుక్క తలకాయ గూడా ఒకందుకు పనికొస్తుందట! ఈ శుద్ధ బుద్ధావతారం గూడా ఒక బుద్ధిమంతుల కుటుంబం తన పబ్బాన్ని గడుపుకోడానికి పనికొచ్చాడు. కానీ వాళ్ళ దోషమేమీ లేదు. గాదె క్రింద పందికొక్కుల్లా తమలో నన్నూ ఒకణ్ణిగా వుండిపొమ్మనే వాళ్ళు చెప్పింది. అంత పనీ జరగాలంటే ముందుగా నేను వాళ్ళ మతం పుచ్చుకోవాలి. ఆత్మాభిమానం కుదువపెట్టి దివాలాకోరునై పెంపుడు కుక్కలా బ్రతకడానికి మనసొప్పక ఆ రొంపిలో నుంచి బయటపడ్డాను. అప్పటికింకా నా పైన నాకు నమ్మకముంది. ఈ విశాల ప్రపంచంలో విద్యావంతుడైన ఓ యువకుడికి పరువుగా బ్రతికే అవకాశాలు ఇలా ఇంతగా మృగ్యమైపోతున్నాయని తెలియదు. నా ఆశ నన్ను కాలు గాలిన పిల్లిలా చేసింది. ఆ ఊరు ఈ ఊరు ఈ పట్నం, ఆ నగరం, ఆఫీసు, కంపెనీ, కార్ఖానా, అన్నిచోట్లకూ సుడిగాలిలో తిరిగాను. నా చదువు చిన్న ఉద్యోగాలకు పనికిరాదన్నారు. పెద్ద ఉద్యోగాలు ఖాళీగా లేవన్నారు. నీ కంటే ముందుగా చదివిన వాళ్ళెందరో ఉద్యోగాల కోసం దేబరిస్తుండగా నీ ఉద్యోగానికిప్పుడేం తొందరొచ్చిందని విసుక్కున్నారు. నా జేబులో డబ్బులు నిండుకున్నాయి. రోజు రోజంతా ఒకటి రెండు కాఫీలతో వుండిపోవలసి వచ్చింది. గడ్డం గీక్కోవాలన్నా, బట్టలు సబ్బుపెట్టి వుతుక్కోవాలన్నా దారిలేని పరిస్థితు లేర్పడ్డాయి. "అయ్యోపాపం! చూడానికి పిచ్చివాడిలా వున్నాడు. ఎంయేదాకా చదువుకొన్నాడట!" అని చెప్పుకోడానికి మాత్రమే నా చదువు పనికొచ్చింది.

పిందె పండుగా మారేలోగా ఎన్నో పరిణామాలు పొందవలసి వుంటుంది. నా పిచ్చిగూడా దీని పతాకస్థాయిని చేరుకోడానికి ముందుగా మరికొన్ని దశలు అందుకోవలసి వుంటుందేమో! ఆ అనుభవాలను గురించే చెబుతున్నాను.

ఇక్కడొక హైస్కూలుండేది. ఈ మధ్యనే అది జూనియర్ కాలేజిగా మారింది. ఇక్కడెంత తలమాసిన వాడికైనా వుద్యోగం దొరకవచ్చునన్న వార్త విన్నాను. అప్పుడు నేనీ వూరికి వందమైళ్ళ దూరంలో వున్నాను. ఈ వంద మైళ్ళ ప్రయాణానికి కావలసిన టిక్కెట్టు డబ్బులు పుట్టించటం కోసం నేనా ఊళ్ళో ఎందరెందరిని ప్రాధేయపడ్డానో, ఎలాంటి పనులు చేయడానికి పూనుకున్నానో చెప్పను. ఇక్కడికొచ్చి పడిపోవడం ముఖ్యం ఈ కాలేజీ ఒక రాజ్యం. దీనికొక కరెస్పాండెంటు వున్నాడు. ఈరాజ్యం పైన అతడి తిరుగులేని అధికారం. ప్రిన్సిపాలు వున్నాడు. ఈయన హైయ్యర్ గ్రేడు టీచరుగా వుండి ప్రయివేటుగా పరీక్షలను చిత్తుచిత్తుచేసి మాష్టరు డిగ్రీ పుచ్చుకొన్న విద్యలవస్తాదు. పరీక్షల్లో

పాసుకావడానికిన్నీ, విజ్ఞానం పెంపొందడానికిన్నీ ఏ మాత్రం సంబంధంలేదని నిరూపించిన ఘనత ఈయనకు దక్కుతుంది. హైస్కూలు కాలంలో హెడ్మాస్టరుగా వుండి, యిది కాలేజిగా మారగానే ఈయన ప్రిన్సిపాలుగా మారాడు. ఇదొక యూనివర్సిటి అయితే ఈయన వైస్-ఛాన్సలర్ కావడానికి వెనుకాడదు. ఆ కరెస్పాండెంటు ఈ ప్రిన్సిపాలూ కలిసి ఈ విద్యాసంస్థనొక దుకాణంలా తెరిచి పెట్టుకున్నారు. ఎక్కడా మారని నాణేలు యిక్కడ చలామణి అయిపోతాయి. బేరమంతా ఫిక్సెడ్ రేటు పైన జరుగుతుంది. స్టూడెంటయితే సీటుకోసం అయిదు వందలిచ్చుకుంటాడు. లెక్చరరయితే ఉద్యోగం కోసం అయిదువేలు ఇచ్చుకుంటాడు. రూపాయలు కాదుగదా నా దగ్గర అయిదువేల పైసలైనా లేవు. ఐతేనేం ప్రత్యేకించి నాలాంటి ముదనష్టపు వాళ్ళపైన ఈ కాలేజీ కమిటీ వాళ్ళకు దయాదాక్షిణ్యాలు చాలా వున్నాయి. నా జీతం నెలకు నాలుగు వందలు గదా అందులో నేను రెండు వందలు మాత్రమే పుచ్చుకుంటాను. నాలుగు వందలూ పుచ్చుకున్నట్టు స్టాంపుల మీద సంతకాలు చేసేస్తుంటాను. రెండేళ్ళు గడిచేటప్పటికి నేను ఋణ విముక్తిణ్ని గావడం సాధ్యమే అయినా సంభవం మాత్రం కాదు. ఎందుకంటే ఆ గడువు కాస్తా గుర్తుంచుకుని కొన్ని నెలలకు ముందుగానే నన్ను కబళించడానికి పోస్టింగు భూతం పొంచి వుంటుంది. ఈ రెండు వందల రూపాయల ముదరా తతంగాన్ని మళ్ళీ నేనెంత కాలమైతే పొడిగిస్తానో అంతవరకూ ఆ భూతం శాంతిస్తుంది. బ్రతుకు నన్నెంతగా దగాచేసినా, నాకింకా బ్రతుకుపైన ఆశ వుంది. వాళ్ళు కోరిన విశ్వామిత్ర వరాల కన్నింటికీ తల ఒగ్గాను. ఉద్యోగంహద్దులోకి అడుగుపెట్టాను. అక్కడ నిలబడి చూస్తే పరిస్థితి మరింత ఘోరంగా కనబడింది. ప్రిన్సిపాలుగారున్నాడే పాపం ఆయన నిరవాకమేమిలేదు "హిజ్ ........." క్రింద 'యువర్స్ మోస్ట్ ఒబిడియంట్లీ" అంటూ సంతకం నమోదు చెయ్యడం వరకే అతడి వంతు, నిజమైన అధికారం ఒక ఆడ టీచరుది. కాలేజికి అనుబంధంగా వున్న హైస్కూలు సెక్షనులో ఆవిడ ఒక పంతులమ్మ. రూల్స్, రెగ్యులేషన్స్ ఆవిడ కాలిచెప్పు క్రింద తేళ్ళు. ఆమెగారి కింత బలం ఎక్కడి నుంచి వచ్చిందనేది ఒక బహిరంగ సత్యం. ఆమె మాటలేనిదే కరెస్పాండెంటు పూచిక పుల్లంత పనైనా చెయ్యడు. తన పొజిషన్ని తాను కాపాడుకోదలిచే ప్రతి ఉద్యోగి రోజుకోసారి ఆమెకు సలాములు పెట్టాలి. అడపా దడపా పొగడ్తలతో మలాము వెయ్యాలి. వరుసగా నాలుగు రోజులు ఆవిడకు కనిపించుకోని ఉద్యోగి ఎవరైతే వున్నాడో వాడి కళ్ళు నెత్తిమీద కొచ్చినట్టు! వాణ్ణి పిలిచి ముఖం వాచేటట్టుగా

చీవాట్లు పెట్టడానికి కరెస్పాండెంటుకు వెయ్యి కారణాలు స్ఫురిస్తాయి. అమ్మగారి చుట్టూ హంగుదార్ల బృందం ఒకటి వాళ్ళ ననుసరించి నడుచుకోడంపైన కూడా ఉద్యోగ భద్రత చాలావరకూ ఆధారపడి వుంటుంది. ఈ చెరలో ఖైదీగా, వీళ్ళ కనుసన్నల్లో కీలు బొమ్మగా వుంటూ, ఈ విధంగా జీవితంలో సుఖపడిపోయే మహదవకాశం నాకు లభించింది. మేష్టరు గారూ! నడిరోడ్డులో సీజరు శవాన్ని ప్రదర్శిస్తూ ఆంటోనీ చెప్పిన మాటల్ని ఇక్కడ మననం చేసుకోవాలి. విద్యావేత్తల దగ్గర, విద్యాభిమానుల దగ్గరా ఇంకా ఏ మాత్రం కన్నీళ్ళయినా నిలవవుంటే, వాటిని కార్చడానికింత కంటే తగిన సమయం ఎప్పుడుంటుంది?

మేష్టరుగారూ! చిట్టచివర నా ప్రార్థన ఒకటి. మీరు తప్పకుండా ఆలకించాలి. విద్యావ్యవస్థకు ఒక కొసలో మీరు ఇంకొక కొసలో నేను. ఈ గోడు – మనగోడు. మనవరకు మాత్రమే పరిమితమై వుండనిమ్మని నా వేడికోలు. దయచేసి ఈ వుత్తరాన్ని నా తల్లిదండ్రులకు చూపించకండి. వాళ్ళకోసం ప్రత్యేకంగా ఒక జాబు వ్రాసి యిందులోనే పెడుతున్నాను. నిజ జీవితం ద్వారా కాకపోతేమానె, ఒక భ్రమద్వారా ఒక అబద్ధం ద్వారా చివరి రోజుల్లో తల్లిదండ్రులకు ఆనందం కలిగించే అమూల్యావకాశన్నయినా ఈ నిర్భాగ్యుడికి ప్రసాదించండి. నమస్కారాలతో, భవదీయుడు – చింతామణి".

పుట్టినప్పటి నుంచీ అంటిపెట్టుకున్న రెక్కలు ఒక దారుణమైన విపర్యయం తాకిడికి తునాతునకలైపోగా, గిరికీలు కొడుతూ కొడుతూ వచ్చి నేలపైన పడ్డట్టుగా నా తల దిమ్మతిరిగింది. ఎవరైనా చూచిపోతారేమోనని దొంగిలించిన వస్తువుకు మల్లే ఆ వుత్తరాన్ని జేబులో దాచుకున్నాను.

అన్నట్టు ఉత్తరంలో వ్రాయబడిన మేరకు కవరులో యింకొక జాబు కూడా వుండాలి. తీసి చూచాను. కవరులో ఓ మూలగా నక్కివున్న చీటీ కనిపించింది.

మడత విప్పిన చీటీలో బాగా ఆలోచించి, ఎంతో నెమ్మదిగా దస్తూరీ కూడా పొంకంగా కుదిరించి వ్రాసినట్టుగా అక్షరాల చాళ్ళు–

"ప్రియమైన నాన్నగారికి, అమ్మగారికి నమస్కారాలు. ఎంయే, ఫస్టుక్లాసులో పాసయ్యానా, ఆ సంతోషంలో మిత్రులందరం కలిసి వినోదంగా ఉత్తరదేశ యాత్ర చేసి రావాలని అనుకున్నాము. ఆ యాత్రలో యించుమించుగా ఆరు నెలలు ఆరు నిమిషాలలాగా దొర్లిపోయాయి. తిరిగి రావడమే ఆలస్యం. నాకోసం ఉద్యోగం ఎదురుచూస్తున్నట్టు

తెలిసింది. వెంటనే వచ్చిచేరి పోయాను. మన ప్రాంతానికీ వూరు చాలా దూరమే ననుకోండి. ఉద్యోగమన్న తర్వాత ఎంత దూర ప్రదేశమైనా వెళ్ళవలసిందేనన్న విషయం మీకు తెలియంది కాదు. ప్రారంభంలో నెల జీతం ఆరు వందలదాకా ముదుతుంది. క్రమక్రమంగా హెచ్చుతుంది గూడా.

నాకిక్కడ ఏ విధమైన కొరతాలేదు. నెలకొక వంద రూపాయలు మనవి కావనుకుంటే, ముచ్చటగా బంగళాలాంటి యిల్లు దొరుకుతుంది. మొన్ననే ఒక యిల్లు చూచి వచ్చాను. రేపో మాపో అడ్వాన్సు యిచ్చి రావాలి. మంచిరోజు చూచుకుని చి॥సౌ॥ మీ కోడలిని రమ్మని వ్రాయాలి. నన్ను గురించి మీరెలాంటి విచారమూ పెట్టుకోవద్దు. మీ రక్కడ ఎంత సుఖంగా వుంటే నాకిక్కడ అంత సంతృప్తిగా వుంటుంది. పొలం ఎవరికైనా కౌలుకిచ్చి మీరు యింటిపట్టున వుండి విశ్రాంతి తీసుకోవలసింది. నెలనెలా మీకు నేను కొంత పైకం పంపగలను.

అక్కయ్యలకు నా క్షేమాలు తెల్పండి. చెల్లాయికి శుభాశీస్సులు. ఇట్లు, మీ ప్రియమైన కుమారుడు".

(ఆంధ్రజ్యోతి వీక్లీ- 8-6-73 to 6-7-73)

❀ ❀ ❀